# ప్రజా తపన

prajathapana.com

*News that matters*




**సత్యం, పవిత్రత,నిస్వార్థం, భూనభోంతరాల్లోని ఏ శక్తీ ఈ సుగుణములతోజాజ్వల్యమానంగా ప్రకాశించే వారి నీడనైనా తాకలేదు. విశ్వమంతా ఒక్కటై ఎదిరించినా వారు ప్రతిఘటించగలరు.**

**- స్వామి వివేకానంద**


**సంపుటి :01 సంచిక: 95 శనివారం 27 మే 2023 మిరియాల. మంజునాథ ఆధ్వర్యంలో పేజీలు :08 ధర :05/-**


# చంద్రబాబును నమ్మితే నట్టేట మునిగినట్టే

**విజయవాడ:**



అమరావతిలోని ఆర్-5జోన్‌లో ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్ ప్రారంభించారు. తుళ్లూరు మండలం వెంకటాయ□పాలెం వద్ద ఏర్పాటు చేసిన వేదికపై నుంచి లబ్ధిదారులకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తారు. అక్కడే నిర్మించిన టిడ్కో ఇళ్లను కూడా లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడి జగన్.... చంద్రబాబుపై ధ్వజమెత్తారు. పేదలకు ఇళ్లు ఇవ్వాలన్న ఆలోచన గత ప్రభుత్వంలో ఎప్పుడైనా చూశారా? అని ప్రశ్నించారు సీఎం జగన్. సీఆర్డీయే ప్రాంతంలో 5,024 మందికి పూర్తైన టిడ్కో ఇళ్లను కూడా అందిస్తున్నామన్నారు. 300 చదరపు అడుగులు ఫ్లాటు కట్టడానికి అయ్యే విలువ దాదాపుగా రూ. 5.75లక్షలు. మౌలిక సదుపాయాలకోసం రూ. 1 లక్ష అవుతుంది. కేంద్రం లక్షన్నర ఇస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం లక్షన్నర ఇస్తుంది. మిగిలిన డబ్బులను బ్యాంకుల నుంచి అప్పుగా తీసుకుని 20 ఏళ్లపాటు లబ్ధిదారుడు కట్టుకోవాలని గత ప్రభుత్వం చెప్పిందన్నారు సీఎం. మొత్తంగా రూ. 7.2లక్షలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. తాము వచ్చాక ఆ ఫ్లాటును పేదవాళ్లకు పూర్తిగా రూ. 1కే రాసిచ్చామన్నారు. అయినా చంద్రబాబు, వారి గజ దొంగల ముఠాకు, ఎల్లోమీడియా వక్రభాష్యాలు చెప్తూనే ఉందన్నారు. చంద్రబాబు తన పాలనలో ఒక్క ఇంటి పట్టాకూడా ఇవ్వలేదన్నారు. గతంలో చంద్రబాబు 600 హామీలతో మేనిఫెస్టో విడుదల చేసి అందర్నీ మోసం చేశారన్నారు సీఎం జగన్. ఎన్నికలకు దగ్గరపడే కొద్దీ.. మళ్లీ ఒక మేనిఫెస్టో అంటున్నారన్నారు. సామాజిక వర్గాలు మీద మోసపూరిత ప్రేమ చూపిస్తున్నాడని ఎద్దేవా చేశారు. వారికోసమే మేనిఫెస్టో అని అంటున్నారని విమర్శించారు. మోసం చేసేవాడ్ని ఎప్పుడూ కూడా నమ్మొద్దని పిలుపునిచ్చారు. నరకాసురుడినైనా నమ్మొచ్చు కాని, నారా చంద్రబాబునాయుణ్ని మాత్రం నమ్మకూడదన్నారు సీఎం జగన్. 2014 -2019 వరకూ ఒక ఇళ్లపట్టా కూడా చంద్రబాబు ఇవ్వలేదన్నారు సీఎం. కరోనా కష్టాలు రెండేళ్లు రాష్ట్రాన్ని వెంటాడినా, రాష్ట్రానికి వచ్చే వనరులు తగ్గినా.. మీ కష్టం ఎక్కువే అని భావించి పరుగెట్టామన్నారు. కోవిడ్ సమయంలో కూడా 30 లక్షల ఇళ్లపట్టాలు ఇచ్చామని గుర్తు చేశారు. ఆర్థికంగా

02

## కొత్త పార్లమెంట్ ప్రారంభోత్సవానికి అంతా సిద్ధం



**న్యూఢిల్లీ :**

మే 28వ తేదీన కొత్త పార్లమెంట్ ప్రారంభోత్సవం ఉదయం 7.30 గంటలకే మొదలు కానుంది.ఈ నెల మే 28వ తేదీన కొత్త పార్లమెంట్ ప్రారంభోత్సవానికి అంతా సిద్ధమైంది. ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఇది ప్రారంభం కానుంది. దీనిపై దేశవ్యాప్తంగా రాజకీయాలు జరుగుతున్నప్పటికీ...ఇదో చరిత్రాత్మక ఘట్టం అని మోదీ సర్కార్ ఇప్పటికే స్పష్టం చేసింది. పాత పార్లమెంట్‌లో కొన్ని లోపాలున్నాయని...వాటన్నింటినీ సవరిస్తూ కొత్త పార్లమెంట్ కట్టామని చెబుతోంది. ఈ వివాదాల సంగతి పక్కన పెడితే...ఆ రోజు అంగరంగ వైభవంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు కేంద్రం ప్లాన్ చేసుకుంది. పక్కా షెడ్యూల్ ప్రకారమే ప్రతిదీ జరగనుంది. ఈ కార్యక్రమంలో

02



## ఎర్రగంగిరెడ్డి బెయిల్ రద్దు

**న్యూఢిల్లీ :**

ఎర్ర గంగిరెడ్డికి సుప్రీం కోర్టులో షాక్ వివేకా హత్య కేసులో ఏ1 నిందితుడిగా ఉన్న ఎర్ర గంగిరెడ్డిని జులై 1న గంగిరెడ్డిని జైలు నుంచి విడుదల చేయాలన్న తెలంగాణ హైకోర్టు ఉత్తర్వులపై సుప్రీంకోర్టు స్టే విధించింది. గంగిరెడ్డి డీఫాల్ట్ బెయిల్ ను రద్దు చేస్తూ గత నెల 27న హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. జూన్ 30లోగా దర్యాప్తును పూర్తి చేయాలని సీబీఐని ఆదేశించిన హైకోర్టు... జులై 1న ఆయనను విడుదల చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. దీంతో, హైకోర్టు తీర్పును వివేకా కుమార్తె సునీత సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఆయనకు బెయిల్ ఇస్తే సాక్షులను ప్రభావితం చేస్తారని పిటిషన్ లో ఆమె పేర్కొన్నారు. పిటిషన్ ను విచారించిన సుప్రీం ధర్మాసనం జులై 1న గంగిరెడ్డిని విడుదల చేయాలన్న హైకోర్టు ఆదేశాలపై స్టే విధించింది.సుప్రీంకోర్టులో సునీత దాఖలు చేసిన పిటిషన్ పై విచారణలో ఎర్ర గంగిరెడ్డి బెయిల్ నిబంధనల వ్యవహారంపై సుప్రీంకోర్టు విస్మయం

03

# 21 రోజులు దశాబ్ది ఉత్సవాలు

**హైదరాబాద్, :**

దశాబ్ది ఉత్సవాల ఘనంగా నిర్వహించాలని టీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యంగా జూన్ 2వ తేదీ నుంచి 22 వరకు జరగనున్న ఏ రోజు కారోజు రోజువారీ కార్యక్రమాలను ముఖ్యమంత్రి జిల్లా కలెక్టర్లకు వివరించారు. ఈ మూడు వారాల ఉత్సవాల విశిష్టతను, ప్రాముఖ్యత ప్రాశస్త్యాన్ని అందరికీ అర్థమయ్యేలా చెప్పారు. గ్రామాలు, నియోజకవర్గాలు, జిల్లాల వారిగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, క్షేత్రస్థాయిలో వాటి నిర్వహణ గురించి ప్రత్యేకంగా చెప్పారు. మంత్రులు, శాసనస భ్యులు, ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాల్సి ఉంది జూన్ 2వ తేదీ - ప్రారంభోత్సవంసీఎం కేసీఆర్ హైదరాబాద్ లోని గన్ పార్క్ వద్ద గల అమరవీరుల స్థూపం వద్ద నివాళు లర్పిస్తారు. అనంతరం హైదరాబాద్ లోని బీఆర్ అంబేద్కర్ సచివాలయం ప్రాంగణంలో పతాకావిష్కరణ చేస్తారు. ఉత్సవాలను ఉద్దేశించిన సీఎం కేసీఆర్ సందేశిస్తారు. అలాగే జిల్లాల్లో మంత్రివర్యుల ఆధ్వర్యంలో పతాక



02



## 75 రూపాయిల కాయిన్

**న్యూఢిల్లీ :**

ఈ నెల 28వ తేదీన మధ్యాహ్నం 12 గంటలకు ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా కొత్త పార్లమెంట్ ప్రారంభం కానుంది. ఇప్పటికే ఇందుకు సంబంధించిన ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. పక్కా షెడ్యూల్ ప్రకారం ఈ తంతు జరగనుంది. ఇదే

03

# వందేభారత్ లో స్లీపర్ కోచ్

**సికింద్రాబాద్:**

విదేశాల్లోని ఆధునిక రైళ్లతో పోటీపడే రీతిలో రూపుదిద్దుకుని సూపర్ సక్సెస్ అయిన వందేభారత్ రైళ్ల తదుపరి వర్షన్ తయారీకి రైల్వే సిద్ధమైంది. ప్రస్తుతం చైర్ కార్ కోచ్‌లతో నడుస్తున్న ఈ రైళ్లలో స్లీపర్ కోచ్‌లను ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. దీనికి సంబంధించి డిజైన్లు రూపొందించేందుకు రైల్వే చర్యలు ప్రారంభించింది. వచ్చే ఏడాది మార్చికల్లా డిజైన్లు ఖరారు చేసి రైల్ కోచ్‌ల తయారీ ప్రారంభించాలని నిర్ణయించింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా దాదాపు 800 కి.మీ.లోపు దూరం ఉన్న ప్రధాన నగరాల మధ్య వందేభారత్ రైళ్లను



ప్రారంభిస్తున్న విషయం తెలిసిందే. దక్షిణ మధ్య రైల్వేకు సంబంధించి సంక్రాంతి రోజున సికింద్రాబాద్-విశాఖపట్నం మధ్య నడిచే తొలి వందేభారత్ రైలును, ఏప్రిల్‌లో రెండో వందేభారత్ సర్వీసుగా సికింద్రాబాద్-

03

# గ్రూప్-1, గ్రూప్-2 నోటిఫికేషన్లకు గ్రీన్ సిగ్నల్

**అతి త్వరలో విడుదల కానున్న నోటిఫికేషన్**

**1000కిపైగా పోస్టుల భర్తీ**

**అమరావతి**

గ్రూప్-1. గ్రూప్-2 పోస్టుల భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్ జారీకి సీఎం వైయస్.జగన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ ఉదయం ముఖ్యమంత్రికి అధికారులు ఈపోస్టుల భర్తీపై వివరాలు అందించారు. సీఎం ఆదేశాల మేరకు ఈ పోస్టుల భర్తీ ప్రక్రియ చురుగ్గా సాగుతోందని వెల్లడించారు. ప్రభుత్వంలోని వివిధ శాఖల

02





# 21 రోజులు దశాబ్ది ఉత్సవాలు

(మొదటిపేజీ తరువాయి)

వందనం, దశాబ్ది ఉత్సవ సందేశం కూడా జరుగుతుంది.జూన్ 3వ తేదీ ? తెలంగాణ రైతు దినోత్సవంరాష్ట్రంలోని అన్ని రైతు వేదికల్లో క్లస్టర్ పరిధిలోని గ్రామాల రైతుల సమావేశం నిర్వహిస్తారు. సమావేశాలను జాతీయ గీతాలపనతో ప్రారంభిస్తారు. సభలో రైతుబంధు సమితుల నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, మండలాధ్యక్షులు,ఖంఅూ చైర్మన్లు, వ్యవసాయ, హార్టికల్చర్, మండల స్థాయిలోని వివిధ శాఖల అధికారులు, నాయకులు అందరూ పాల్గొంటారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ కరపత్రం, బుక్ లెట్, పోస్టర్ల వంటి సమాచార సామగ్రిని తయారు చేసి, కలెక్టర్లకు పంపిస్తుంది. వీటిని ప్రతి రైతుకు అందేలా పంపిణీ చేయాలి. వ్యవసాయ కళాశాలల్లోనూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలి. రైతులందరితో సామూహిక భోజనం చేస్తారు.జూన్ 4వ తేదీ ? సురక్షా దినోత్సవం రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు చేస్తున్న కృషిని, స్నేహపూర్వక విధానాన్ని, సమర్థవంతమైన సేవలను వివరించే విధంగా కార్యక్రమాలు ఉంటాయి. అలాగే హైదరాబాద్ నెక్లెస్ రోడ్డుపై పెట్రోలింగ్ కార్స్, బ్లూ కాల్ట్స్ ర్యాలీ నిర్వహిస్తారు. హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ల పరిధిలోని వారంతా ఈ కార్యక్రమాల్లో పాల్గొంటారు. సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటల వరకు అంబేద్కర్ విగ్రహం ముందు పోలీస్ బ్యాండ్లతో ప్రదర్శన కూడా చేస్తారు. సాయంత్రం ప్రజలు, ప్రజాప్రతినిధులు, పోలీసు సిబ్బందితో సభ నిర్వహిస్తారు. జూన్ 5వ తేదీ ? తెలంగాణ విద్యుత్తు విజయోత్సవం:నియోజకవర్గ స్థాయిలో రైతులు, వినియోగదారులు, విద్యుత్ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తారు. సమావేశంలో విద్యుత్ రంగంలో సాధించిన గుణాత్మక మార్పును వివరిస్తారు. సాయంత్రం రవీంద్రభారతిలో రాష్ట్ర స్థాయి సమావేశం ఉంటుంది. ఈ సమావేశంలో రాష్ట్రం గత 9 ఏండ్లలో సాధించిన విజయాలపై డాక్యుమెంటరీ ప్రదర్శన, పుస్తకావిష్కరణ, ప్రసంగాలు ఉంటాయి. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ మంత్రి, సీఎండీ జెన్ కో, ట్రాన్స్ కో, స్పెషల్ సీఎస్ ఎనర్జీ, మొత్తం విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు, ఉద్యోగులు, పారిశ్రామిక వేత్తలు, ఇతర విద్యుత్ వినియోగదారులు పాల్గొంటారు.జూన్ 6వ తేదీ ? తెలంగాణ పారిశ్రామిక ప్రగతి ఉత్సవంపారిశ్రామిక వాడలు, ఐటీ కారిడార్లలో సభలు నిర్వహించాలి. ఈ సభలో పారిశ్రామిక రంగంలో సాధించిన ప్రగతిని ప్రకటించాలి. టీఎస్ ఐపాస్ ద్వారా పరిశ్రమల స్థాపన, అనుమతులు సులభతరమైన విషయాన్ని ప్రస్తావించాలి. రాష్ట్రానికి తరలి వచ్చిన పెట్టుబడుల వెల్లువకు సంబంధించిన వివరాలను, తద్వారా పెరిగిన ఉద్యోగ ఉపాధి అవకాశాల వివరాలు ప్రకటించాలి. పాంప్లెట్లు ప్రచురించి, పంచాలి. టి హబ్, వి హబ్ లలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల సమావేశం నిర్వహించాలి. ఐటీ ఎగుమతులు, ఉద్యోగ కల్పనలో హైదరాబాద్, బెంగళూరును అదిగమించి దేశంలోనే నెంబర్ 1గా నిలిచిన తీరును ఆవిష్కరించాలి. జూన్ 7వ తేదీ ? సాగునీటి దినోత్సవం..కాళేశ్వరం ప్రాజెక్టు పై ప్రభుత్వం రూపొందించిన డాక్యుమెంటరీని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ప్రదర్శించాలి. ఈ డాక్యుమెంటరీని జిల్లా కలెక్టర్లు అందరికీ పంపిస్తారు. సాగునీటి రంగంలో సాధించిన రికార్డు స్థాయి ప్రగతిని వివరిస్తూ ప్రతి నియోజకవర్గంలో 1000 మందితో సభ జరపాలి. ఈ సభలో రైతులు, ఎమ్మెల్యే, ఇతర ప్రజాప్రతినిధులు, ఇరిగేషన్ అధికారులు పాల్గొనాలి. అలాగే రవీంద్ర భారతిలో ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సాగునీటి రంగంలో సాధించిన విజయాలపై సమావేశం జరుగుతుంది. పుస్తకాల ఆవిష్కరణ, ప్రసంగాలు. తదితర కార్యక్రమాలు ఉంటాయి. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు, ఇంజినీర్లు, రిటైర్డ్ ఇంజినీర్లు, మేధావులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొంటారు. జూన్ 8వ తేదీ ? ఊరూరాచెరువుల పండుగ..గ్రామ పంచాయతీలు, నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో గ్రామంలోని పెద్ద చెరువు వద్ద సాయంత్రం 5 గంటలకు చెరువుల పండుగ నిర్వహించాలి. గ్రామం నుంచి డప్పులు, బోనాలు, బతుకమ్మలు, మత్స్య కారుల వలలతో ఊరేగింపుగా బయలుదేరాలి. గ్రామంలోని రైతులు, మత్స్య కారులు, మహిళలుఅన్ని వర్గాల ప్రజలు చెరువు కట్టకు చేరుకోవాలి. కట్ట మైసమ్మపూజ ? చెరువు నీటికి పూజ చేయాలి. తదనంతరం సభ, సాంస్కృతిక కార్యక్రమాలు ? బతుకమ్మ, కోలాటాలు ? పాటలు, గోరేటి వెంకన్న రాసిన చెరువోయి.. మా ఊరి చెరువు తదితర చెరువు పాటలు వినిపించాలి. ఇరిగేషన్ లో వచ్చిన ప్రగతి, తద్వారా పెరిగిన పంటల ఉత్పత్తి వివరాలు, మత్స్య సంపద, భూగర్భ జలాల పెరుగుదల.. తదితర వివరాలను తెలియజేస్తూ, ఫ్లెక్సీలు పెట్టాలి ? పాంప్లెట్లు పంచాలి ? చదివి వినిపించాలి. నాయకులు, ప్రజలు కలిసి చెరువు కట్టమీద సహపంక్తి భోజనాలు చేయాలి. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు, ఇంజనీర్లు, రిటైర్డ్ ఇంజినీర్లు, మేధావులు, తదితరులు పాల్గొంటారు. జూన్ 9 – తెలంగాణ సంక్షేమ సంబురాలు..నియోజకవర్గ స్థాయిలో ప్రభుత్వం అందించిన ఆసరా పించన్లు, కల్యాణ లక్ష్మి లబ్ధిదారులతో వెయ్యి మందికి తగ్గకుండా పాల్గొనేలా సభ నిర్వహించాలి. తాము పొందిన లబ్ది గురించి, లబ్ధిదారుల చేత మాట్లాడించాలి. తెలంగాణ సంక్షేమంలో స్వర్ణయుగం సాధించిన తీరును, దేశానికి దిక్సూచిగా మారిన తీరును వివరిస్తూ రవీంద్ర భారతిలో ఒక సభ నిర్వహించాలి. గొల్ల కుర్మలకు గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించుకోవాలి. గతంలో భూములు సేకరించిన చోట, అందుబాటులో ఉన్న చోట అర్హులైన పేదలకు ఇండ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం ప్రారంభించాలి. వివిధ గ్రామీణ వృత్తి పనుల వారికి ఆర్థిక ప్రేరణ కింద లక్ష రూపాయల పంపిణీ పథకం ప్రారంభం. జూన్ 10వ తేదీ – తెలంగాణ సుపరిపాలన దినోత్సవం – పరిపాలన సంస్కరణలు, ఫలితాలుఅన్ని జిల్లా కేంద్రాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి, రాష్ట్రంలో పరిపాలన సంస్కరణల ద్వారా ప్రభుత్వ వ్యవస్థలను ప్రజలకు మరింత చేరువ చేయడం ద్వారా కలిగిన మేలును ప్రముఖంగా ప్రస్తావించాలి. ఈ కార్యక్రమంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు అందరినీ భాగస్వామ్యం చేయాలి. నూతనంగా ఏర్పడిన మండలాలు, మున్సిపాలిటీల్లో సంబురాలు జరిగేలా స్థానిక ఎమ్మెల్యేలు బాధ్యత తీసుకోవాలి. జూన్ 11వ తేదీ – తెలంగాణ సాహిత్య దినోత్సవం – రాష్ట్ర స్థాయిలో, జిల్లాస్థాయిలో కవి సమ్మేళనాలురవీంద్రభారతిలో తెలంగాణ గంగాజమునా తెహజీబ్ ప్రతిబింబించేలా ఉర్దూ, తెలుగు కవులచే రాష్ట్ర స్థాయి కవి సమ్మేళనం నిర్వహించాలి. ఈ కార్యక్రమాల్లో తెలంగాణ కవులు, సాహిత్యాభిమానులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారు. జిల్లాస్థాయి కవి సమ్మేళనంలో చదివిన కవితలతో కవితా సంకలనం ప్రచురించాలి. రాష్ట్రస్థాయి కవి సమ్మేళనంలో చదివిన కవితలతో కూడా ఒక కవితా సంకలనాన్ని ప్రచురించాలి. జూన్ 12వ తేదీ ? తెలంగాణ రన్ తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో యువకులు, విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, తదితరులతో ఉదయం 6 గంటలకు తెలంగాణ రన్ కార్యక్రమం నిర్వహించాలి. ఈ రన్ కార్యక్రమం పోలీసు శాఖ నేతృత్వంలో జరుగుతుంది. క్రీడలు, యువజన సర్వీసులశాఖ భాగస్వామ్యాన్ని పంచుకోవాలి. ఈ సందర్భంగా ప్రత్యేకంగా బెలూన్స్ ఎగురవేయాలి. జూన్ 13 – మహిళా సంక్షఏమ దినోత్సవంనియోజకవర్గం కేంద్రంలోమహిళా సదస్సు నిర్వహించాలి. ఈ సదస్సులో అంగన్వాడీ టీచర్లు, సెర్ప్ సిబ్బంది, ఇతరులు మొత్తం 1000 మందికి తగ్గకుండా పాల్గొనేలా చూడాలి. మహిళా సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న కార్యక్రమాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి సమావేశంలో వివరించాలి. బీడీ కార్మికులకు, ఒంటరి మహిళలకు పింఛన్లు, కల్యాణలక్ష్మి, ఆరోగ్య లక్ష్మి, కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్, ఆరోగ్య మహిళ, పోలీసు శాఖలో 33శాతం రిజర్వేషన్, మార్కెట్ కమిటీల్లో రిజర్వేషన్, మహిళలకు వీఎల్ఆర్, షీ టీమ్స్, వి హబ్ ఏర్పాటు, మహిళా ఉద్యోగులకు ప్రసూతి సెలవులు పెంచిన విషయం తదితర విషయాలన్నింటిని ఘనంగా పేర్కొనాలి.జూన్ 14వ తేదీ – తెలంగాణ వైద్యారోగ్య దినోత్సవం హైదరాబాద్ లోని నిమ్స్ లో నూతనంగా ప్రభుత్వం తలపెట్టిన 2000 పడకల ఆసుపత్రి నిర్మాణానికి గౌరవ ముఖ్యమంత్రి గారిచే శంఖుస్థాపన చేస్తారు. నియోజకవర్గ స్థాయిలో కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్, సీఎంఆర్ఎఫ్ లబ్దిదారులు, వైద్యారోగ్య శాఖ సిబ్బంది, నూతన మెడికల్, నర్సింగ్, పారామెడికల్ కాలేజీల విద్యార్థులు తదితరులను ఆహ్వానించి సభ నిర్వహించాలి. ఇందులో వైద్యారోగ్య రంగంలో తెలంగాణ సాధించిన అద్భుత ప్రగతిని పేర్కొనాలి. 33 మెడికల్ కాలేజీలు, బస్తీ దవాఖానలు, పల్లె దవాఖానలు, కంటి వెలుగు, న్యూట్రిషన్ కిట్లు, కేసీఆర్ కిట్లు, ఎంసీహెచ్ లు, మాతా శిశు సంరక్షణ సేవలు, పెరిగిన మౌలిక వసతులు వంటి పూర్తి వివరాల గురించి వివరించాలి. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేషెంట్లకు పండ్లు పంపిణీ చేయాలి. ఉత్తమ ఆశా వర్కర్, ఉత్తమ ఏఎన్ఎం, ఉత్తమ స్టాఫ్ నర్స్, ఉత్తమ ల్యాబ్ టెక్నీషియన్, ఉత్తమ డాక్టర్లకు సన్మానం చేయాలి. అవార్డులు అందించాలి.జూన్15వ తేదీ – తెలంగాణ పల్లె ప్రగతి దినోత్సవంప్రతి గ్రామ పంచాయతీ ముందు జాతీయ జెండా ఎగుర వేయాలి. అనంతరం పల్లె ప్రగతి ద్వారా, గ్రామానికి వచ్చిన నిధుల వివరాలను, వివిధ సంక్షేమ పథకాల ద్వారా గ్రామ ప్రజలకు జరిగిన లబ్దిని, గ్రామంలో నిర్మించిన మౌలిక వసతుల వివరాలను ప్రకటించాలి. గ్రామ పారిశుద్ధ్యం, పచ్చదనం గణనీయంగా మెరుగుపడిన తీరును వివరించాలి. జాతీయ స్థాయిలో సాధించిన అవార్డుల వివరాలను తెలియజేయాలి. నాడు ? నేడు ఫార్మాట్ లో గ్రామీణ ప్రాంతాల్లో జరిగిన అభివృద్ధి గురించి, ప్రజా సంక్షేమానికి మరియు పంచాయతీరాజ్ ద్వారా వస్తున్న నిధుల వివరాలతో ఊరూరా ఫ్లెక్సీలు పెట్టాలి. ఉత్తమ గ్రామ పంచాయతీల సర్పంచులకు, ఉత్తమ మండలాల ఎంపీపీలకు సన్మానం చేయాలి.జూన్ 16వ తేదీ – తెలంగాణ పట్టణ ప్రగతి దినోత్సవంవివిధ పట్టణాల్లో నిర్మించిన సమీకృత వెజ్ నాన్ వెజ్ మార్కెట్ల గురించి, వైకుంఠధామాల నిర్మాణం గురించి, డంప్ యార్డుల గురించి, అర్బన్ ఫారెస్ట్, పార్కుల నిర్మాణం, 10శాతం గ్రీన్ బడ్జెట్ గా కేటాయించడం తదితర అభివృద్ధి అంశాల గురించి ప్రస్తావించాలి. జీవో 58, 59 తదితర జీవోల ద్వారా పేద ప్రజలు నిర్మించుకున్న ఇండ్లకు పట్టాలు అందజేసిన విధానం గురించి ప్రముఖంగా ప్రస్తావించాలి. ఉత్తమ మున్సిపాలిటీల, కార్పొరేషన్ల వార్డు కౌన్సిలర్లకు, చైర్మన్లకు, మేయర్లకు, ఉద్యోగులకు సన్మానం చేయాలి.జూన్ 17వ తేదీ ? తెలంగాణ గిరిజనోత్సవంఆయా గిరిజన గ్రామాల్లో సభలు నిర్వహించాలి. గిరిజన సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకున్న చర్యల గురించి చర్చించుకోవాలి. గిరిజనుల చిరకాల వాంఛను తీరుస్తూ తండాలకు, గూడాలకు గ్రామ పంచాయతీ హోదా కల్పించి తీరును, విద్య, ఉద్యోగాల్లో ఎస్టీల రిజర్వేషన్ 10 శాతం పెంచిన విషయాన్ని ప్రముఖంగా ప్రస్తావించాలి.జూన్ 18వ తేదీ – తెలంగాణ మంచి నీళ్ల పండుగప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, పాత్రికేయులు, వివిధ వర్గాల ప్రజలతో మిషన్ భగీరథ ఫిల్టర్ బెడ్స్, వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ల సందర్శన కార్యక్రమం నిర్వహించాలి. నీళ్లను శు భ్రపర్చుతున్న తీరును వివరించాలి. ఇంటింటికి నల్లాల ద్వారా సరఫరా అవుతున్న తీరును వివరించాలి. రాష్ట్ర స్థాయిలో రవీంద్ర భారతిలో సభ నిర్వహించాలి. ఇందులో సంబంధిత మంత్రి, ఉన్నతాధికారులు పాల్గొనాలి. మిషన్ భగీరథ విజయాలను విశేషంగా తెలియజేయాలి.జూన్ 19వ తేదీ – తెలంగాణ హరితోత్సవంరాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాలు, పట్టణాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించాలి. నర్సరీలను సందర్శించాలి.మొక్కలు నాటే కార్యక్రమం (మాస్ ప్లాంటేషన్) అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాలయాల్లోనూ విధిగా నిర్వహించాలి. గ్రీన్ కవర్ పెంచడంలో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో ఉన్న విషయాన్ని వెల్లడించాలి. హైదరాబాద్ కు గ్రీన్ సిటీ, ఇతర అవార్డులు వచ్చిన తీరును వివరించాలి.జూన్ 20వ తేదీ – తెలంగాణ విద్యాదినోత్సవంరాష్ట్రవ్యాప్తంగా అన్ని విద్యా సంస్థల్లో పాఠశాల నుంచి విశ్వవిద్యాలయం వరకు, అన్ని గురుకుల పాఠశాలలు, వైద్య, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్, ఐటీఐ, ఫారెస్ట్, అగ్రికల్చర్, హార్టికల్చర్, వెటర్నరీ, ఫిషరీస్ తదితర అన్ని విద్యాసంస్థల్లో ఉదయం పతాక వందనం చేయాలి. తదనంతరం సభలో విద్యారంగంలో తెలంగాణ సాధించిన విజయాలను పేర్కొనాలి. ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న మనఊరు మన బడి పాఠశాలల ప్రారంభోత్సవం నిర్వహించాలి.సిద్ధంగా ఉన్న పది వేల గ్రంథాలయాలను, 1600 డిజిటల్ క్లాస్ రూమ్స్ లను ప్రారంభించాలి. పిల్లలకు వ్యాసరచన, చిత్రలేఖనం, పాటల పోటీలు, తదితర కార్యక్రమాలు నిర్వహించాలి.జూన్ 21వ తేదీ – తెలంగాణ ఆధ్యాత్మిక దినోత్సవందేవాలయాలు, మసీదులు, చర్చీలు, ఇతర ప్రార్థనా మందిరాలకు అలంకరణలు చేయాలి. అలాగే దేవాలయాల్లో వేద పారాయణం, మసీదులు, చర్చీల్లో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టాలి. ప్రముఖ క్షేత్రాల్లో ప్రత్యేక భక్తి, సాంస్కృతిక కార్యక్రమాలు. హరికథలు, పురాణ ప్రవచనాలు తదితర కార్యక్రమాలు నిర్వహించాలి. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు అందరూ విధిగా పాల్గొనాలి.జూన్ 22వ తేదీ – అమరుల సంస్మరణఊరూరా గ్రామ పంచాయతీలు ఉదయం 11 గంటలకు సమావేశం కావాలి. అమరులకు శ్రద్ధాంజలి ఘటించి, మౌనం పాటించాలి. అమరులసంస్మరణ తీర్మానం చేయాలి. ఇదే విధంగారాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలు, మండల పరిషత్తులు, కార్పొరేషన్లు, జిల్లా పరిషత్తులలో శ్రద్ధాంజలి ఘటించి, రెండు నిమిషాలు మౌనం పాటించాలి. నిర్ణీత ఫార్మాట్ లో అమరుల సంస్మరణ తీర్మానాలు చేయాలి. హైదరాబాద్లో అమరుల గౌరవార్థం ట్యాంక్ బండ్ నుంచి 6 వేల మందికి తగ్గకుండా, కళాకారులతో భారీ ర్యాలీ –ముఖ్యమంత్రి గారిచే అమరవీరుల స్మారకం ప్రారంభించడం జరుగుతుంది. కళాకారుల ర్యాలీని సాంస్కృతిక శాఖ నిర్వహిస్తుంది.

# చంద్రబాబును నమ్మితే నట్టేట మునిగినట్టే

(మొదటిపేజీ తరువాయి)

ఎన్ని సవాళ్లైనా వచ్చినా సరే నవరత్నాల్లోని ప్రతి ఒక్క వాగ్దానాన్ని నెరవేర్చామని తెలిపారు. ఇచ్చిన ప్రతీ వాగ్దానం కూడా అమలు చేశామన్నారు. మేనిఫెస్టోలో 98శాతం వాగ్దానాలను అమలు చేశామని వివరించారు. ఇళ్ల నిర్మాణాలను దశలవారీగా నిర్మించుకుంటూ ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. ఈ నాలుగేళ్ల పరిపాలనలో ఒక్క రూపాయి అవినీతి జరగలదన్నారు సీఎం జగన్. లబ్ధిదారుల ఖాతాల్లోకి రూ.2.11లక్షల కోట్లు జమచేశామని తెలిపారు. చంద్రబాబు, ఆయన దొంగల ముఠా గతంలో దోచుకుందన్నారు. గతంతో పోలిస్తే అప్పుల వృద్ధిరేటు చూస్తే తక్కవేనన్నారు. మరి చంద్రబాబు హయాంలో ఇలాంటి కార్యక్రమాలు ఎందుకు జరగలేదని ప్రశ్నించారు. వారికి మంచి చేసే ఉద్దేశం లేదున్నారు. వారి దృష్టిలో అధికారంలోకి రావడం అంటే దోచుకోవడానికి, పంచుకోవడానికి, తినుకోవడానికేనన్నారు. ఇవాళ కులాల మధ్య యుద్ధం జరగడంం లేదని క్లాస్ వార్ జరుగుతోందన్నారు సీఎం జగన్.

నవులూరిలోని లేక్‌ను కూడా అభివృద్ధిచేస్తున్నామని వివరించారు.సామాజిక అమరావతిఅమరావతిలో ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమానికి దేశ చరిత్రలో ప్రత్యేకత ఉందన్నారు సీఎం జగన్. పేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వాలని వేల పోరాటాలు దేశంలో చాలా జరిగాయని గుర్తు చేశారు. కానీ, పేదలకు ప్రభుత్వమే ఇళ్లస్థలాలు ఇవ్వడానికి సుదీర్ఘ న్యాయపోరాటం చేయాల్సి వచ్చిందన్నారు. సుప్రీంకోర్టుకు వెళ్లిమరీ.. 50వేల మందికి ఇళ్లస్థలాలు ఇవ్వడం ఒక చారిత్రక ఘటంగా అభివర్ణించారు. ఇలాంటివి చూస్తే ఆశ్చర్యం కలుగుతోందన్నారు. పెదలకు ఇళ్లస్థలాలు ఇవ్వకుండా రాక్షసులు అడ్డుపడ్డారని ప్రతిపక్షాలను ఉద్దేశించి జగన్ విమర్శించారు. ఈ ప్రాంతంలో గజం ధర 15 వేల నుంచి 20 వేల వరకు ఉంటుందన్నారు. అంటే ఒక్కొక్కరికి 7 నుంచి 10 లక్షల రూపాయల విలువైన ఇంటి స్థలాన్ని ఇస్తున్నట్టు చెప్పుకొచ్చారు. సామాజిక పత్రాలుగా ఈ ఇంటి పత్రాలు ఇస్తున్నట్టు అభిప్రాయపడ్డారు. ఇదే అమరావతి.. ఇకమీదట ఒక సామాజిక అమరావతి అవుతుందన్నారు. ఇకపై మన అందరి అమరావతి అవుతుందని చెప్పారు. మంగళగిరి, తాడికొండ నియోజకవర్గాల్లోని 1400 ఎకరాల్లో 50వేల మందికి ఇంటి స్థలాలు ఇస్తున్నామన్నారు సీఎం జగన్. 25 లే అవుట్లలో ఇంటి పట్టాలు ఇస్తున్నట్టు వివరించారు. వారంరోజులపాటు ఈ పండుగ కార్యక్రమం జరుగుతోందన్నారు. ప్రతి లే అవుట్ దగ్గరకు లబ్ధిదారులను తీసుకెళ్లి.. వారికిస్తున్న ఇంటి స్థలం చూపించి.. ఇంటి పట్టా ఇస్తామన్నారు. అక్కడే ఫోటో తీసుకుని చిరునవ్వులు వారి ముఖంలో చూసేలా కార్యక్రమం ఉంటుందన్నారు. జియో ట్యాగింగ్ తీసుకుని.. వారంరోజుల్లో పట్టాల పంపిణీ కార్యక్రమాలు పూర్తవుతాయన్నారు సీఎం జగన్. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తాంమన్నారు. జులై 8న అంటే వైఎస్ ఆర్ జయంతి రోజున ఇళ్ల స్థలాల్లో ఇల్లు మంజూరు చేస్తామన్నారు ఇల్లు కట్టించే కార్యక్రమం మొదలవుతుందని తెలిపారు. ఇప్పటికే ఇళ్ల పట్టాల పంపిణీ జరిగే కార్యక్రమంలో ల్యాండ్ లెవలింగ్, సరిహద్దు రాళ్లను పాతడం, అంతర్గత రోడ్ల నిర్మాణం పూర్తైందన్నార సీఎం జగన్. ఇళ్ల నిర్మాణంపై లబ్ధిదారులకు మూడు ఆప్షన్లు ఇస్తామన్నారు. తాము కట్టుకుంటామంటే.. రూ.1.8లక్షలు బ్యాంకుల ఖాతాల్లో వేస్తామన్నారు. రెండో ఆప్షన్‌గా వారికి కావాల్సిన సిమెంటు, ఇసుక, స్టీల్ లాంటి నిర్మాణ సామగ్రి అందిస్తామని తెలిపారు. నిర్మాణకూలి వారి ఖాతాల్లోకి నేరుగా జమచేస్తామని వివరించారు. ఆప్షన్ 3గా ప్రభుత్వమే కట్టించాలని అడిగితే ఇళ్ల నిర్మించిన ఇస్తామన్నారు సీఎం జగన్. ఇందులో అక్క చెల్లెమ్మలు ఏ ఆప్షన్ తీసుకున్నా ఫర్వాలేదన్నారు. ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన ఇసుక పూర్తిగా అందజేస్తామన్నారు సీఎంజగన్. సిమెంటు, స్టీల్, డోర్ ఫ్రేములు అన్నీ కూడా తక్కువ రేటుకే అందరికీ అందిస్తామన్నారు. మార్కెట్ రేట్‌ల కన్నా తక్కువకే ప్రభుత్వం ఇవన్నీ అందిస్తుందన్నారు. నాణ్యత విషయలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడ్డబోమన్నారు. రూ.35వేలు చొప్పున రుణాలు లబ్ధిదారులకు బ్యాంకుల నుంచి ఇచ్చేలా చేస్తున్నామని వాటిని పావలావడ్డీకే ఇస్తున్నట్టు వివరించారు. ఇల్లు పూర్తైన తర్వాత ఇంటి విలువ.. ప్రాంతాన్ని బట్టి రూ.5 లక్షల నుంచి రూ.10లక్షల వరకూ ఉంటుందన్నారు సీఎం. రూ.2-3 లక్షల కోట్లు మీా చేతిలో పెడుతున్నామన్నారు.

# కొత్త పార్లమెంట్ ప్రారంభోత్సవానికి అంతా సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

ప్రధాని నరేంద్ర మోదీతో పాటు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ పాల్గొంటారు. ప్రధాని నరేంద్ర మోదీ మే 28వ తేదీన మధ్యాహ్నం 12 గంటలకు కొత్త పార్లమెంట్‌ని ప్రారంభిస్తారు.

అయితే...ఉదయం 7 గంటల నుంచే పూజా కార్యక్రమాలు మొదలవుతాయి.

ఉదయం 7.30 గంటలకు హవన్ పూజ మొదలవుతుంది. 8.30 గంటల వరకూ ఇది కొనసాగుతుంది.

8.30 గంటల నుంచి 9 గంటల మధ్యలో సెంగోల్ ని లోక్‌సభలో పొందుపరచనున్నారు. ఈ మొత్తం తంతులో ఇదే హైలైట్ అవనుంది.

9.30 గంటలకు ప్రేయర్ మీటింగ్ జరుగుతుంది. ఈ కార్యక్రమంలో సాధువులు, పండితులు పాల్గొంటారు. ఆ తరవాత ఆది శంకరాచార్యకు పూజలు నిర్వహిస్తారు.

ఆ తరవాత రెండో విడత కార్యక్రమం మొదలవుతుంది. మధ్యాహ్నం 12 గంటలకు ప్రధాని మోదీ పార్లమెంట్‌ని ప్రారంభిస్తారు. జాతీయ గీతాలాపనతో ఇది ప్రారంభం అవుతుంది. ఈ సందర్భంగా రెండు షార్ట్ ఫిల్మ్స్ స్క్రీనింగ్ జరుగుతుంది. ఆ తరవాత రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి సందేశాన్ని రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ చదువుతారు. రాజ్యసభలోని ప్రతిపక్ష నేత కూడా తన సందేశం వినిపిస్తారు.

ఈ కార్యక్రమం చివర్లో ప్రధాని నరేంద్ర మోదీ ఓ కాయిన్, స్టాంప్ విడుదల చేస్తారు. ఆ తరవాత ఆయన జాతిని ఉద్దేశించి ప్రసంగిస్తారు. మధ్యాహ్నం 2-2.30 గంటల మధ్యలో ఈ పూర్తి తంతు ముగుస్తుంది. కొత్త పార్లమెంట్ ప్రారంభోత్సవంపై దేశవ్యాప్తంగా రాజకీయాలు ముదిరాయి. అన్ని పార్టీలనూ ఆహ్వానించామని బీజేపీ చెబుతున్నప్పటికీ.. ఈ కార్యక్రమానికి వచ్చేందుకు విపక్షాలు ఆసక్తి చూపించడం లేదు. దీనిపై బీజేపీ, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఇప్పుడీ వివాదం సుప్రీంకోర్టు గడప తొక్కింది. కొత్త పార్లమెంట్‌ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించాలని ఓ న్యాయవాది సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. పార్లమెంట్‌లో రాష్ట్రపతికి తగిన గౌరవం కల్పించాలని ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రపతిని ఆహ్వానించకుండా లోక్‌సభ సెక్రటేరియట్ రాజ్యాంగ విలువల్ని కించపరిచారని ఆరోపించారు. లాయర్ జయసుకీన్ ఈ పిటిషన్ వేశారు. ఇప్పటికే 19 పార్టీలు తాము హాజరు కావడం లేదని లెటర్ రాశాయి. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేత మాత్రమే పార్లమెంట్‌ని ఓపెన్ చేయించాలని డిమాండ్ చేశాయి. కానీ...బీజేపీ మాత్రం దీనిపై గట్టిగానే వాదిస్తోంది. అనవసరంగా రాజకీయం చేస్తున్నారని మండి పడుతోంది.

# ఇళ్ల పట్టాలు ఇచ్చారు సరే..చెల్లుబాటు ఎంత

**విజయవాడ:**

అమరావతి ఆర్-5 జోన్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి చేతుల మీదుగా ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. అధికారులు అహరహం పనులు చేపడుతుంటే మరోవైపు రైతులు ఆందోళనలకు దిగుతున్నారు రైతులు, పోలీసుల మధ్య తీవ్రస్థాయిలో ఘర్షణ ఏర్పడుతోంది. రాజధాని మాస్టర్ ప్లాన్ ప్రకారం నిర్దేశించిన ఆర్-5 జోన్‌లో ఇళ్ల పట్టాలు పంపిణీ చేయటం విరుద్ధమని రైతులు అంటున్నారు. ప్రభుత్వంతో చావో రేవో తేల్చుకుంటామని అంటున్నారు. ముఖ్య మంత్రి పర్యటన ముగిసేంత వరకు అమరావ తిలో ఆంక్షలు అమలు చేస్తున్నారు. సుప్రీం కోర్టు షరతులతో కూడిన అనుమతులు మంజూరు చేయటంతో ప్రభుత్వం నివేశన స్థలాల వ్యవహారాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. మరోవైపు ఆర్-5 జోన్ పరిధిలోని 25 లేఅవుట్లలో మెరక, అంతర్గత రహదార్ల పనులను రాత్రిళ్లు సైతం నిర్వహించారు. సీఆర్‌డీఏ అధికారులు ఇక్కడే మకాం వేసి పనులు చేయించారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం యాజమాన్య హక్కులు లేని పత్రాలను పంపిణీ చేయాల్సి ఉంటుంది. కోర్టు కేసుల్లో ఉంటే ఇళ్లు కట్టుకోవడానికి ఎలా అనుమతిస్తారని.. ఇప్పుడు యాజమాన్య హక్కులు లేని పట్టాలను ఇవ్వడం వల్ల పేదలకు కూడా పెద్దగా మేలు జరగదని విపక్షాలు అంటున్నాయి. పేదలకు ఇచ్చే స్థలాల్లో లక్షలు పోగు చేసుకుని అక్కడ వారు ఇళ్లు కట్టుకోవాల్సి ఉంటుంది. అలా ఇళ్లు కట్టుకున్న తర్వాత కోర్టు తీర్పు వ్యతిరేకంగా వస్తే వారి సొమ్ము మొత్తం బూడిదలో పోసిన పన్నీరవుతుంది. కోర్టు తీర్పు వచ్చిన తర్వాతే ఇల్లు కట్టుకోండి అని చెబితే ప్రజలు నమ్మరు. అందుకే కోర్టు తీర్పులు క్లియర్ అయిన తర్వాతే అమరావతి భూములు పంపిణీ చేస్తే ప్రభుత్వం నిజాయితీగా ఉందని ప్రజలు నమ్ముతారన్న అభిప్రాయం వినిపస్తోంది. లేకపోతే పేదలు కూడా తమను రాజకీయ కుట్రలకు వాడుకుంటున్నారన్న అభిప్రాయానికి వస్తారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. యాభై వేల కుటుంబాలకు అమరావతిలో రైతులు ఇచ్చిన పొలాల్లో సెంటు స్థలాలను కేటాయించడం అంటే చిన్న విషయం కాదు. అయితే ఇలా ఇస్తున్న పట్టాలపై ఒక్క పేద కుటుంబానికి కూడా హక్కు రాదు. రేపు హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు సమర్థిస్తే.. ఈ ఇళ్ల స్థలాలు ఇప్పుడు పంపిణీ చేసినా పేదలకు హక్కులు లేకుండా పోతాయి. సీఎం జగన్ పేదలకు సెంటు స్థలాలు ఇవ్వాలనుకుంటే.. అనేక చోట్ల ఇతర స్థలాలు ఉన్నాయని టీడీపీ నేతలు గుర్తు చేస్తున్నారు. వివాదాస్పద భూముల్నే ఇవ్వాల్సిన అవసరం లేదంటున్నారు. అయితే ప్రభుత్వం మాత్రం అమరావతికి రైతులు ఇచ్చిన భూముల్నే ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. కారణం ఏదైనా ఆయన ఇతర అభ్యంతరాలను పరిగణనలోకి తసుకోవడం లేదు. అమరావతి కోసం రైతులు ఇచ్చిన భూముల్ని సెంటు స్థలాలుగా ఇచ్చేసిన వెంటనే అక్కడ ఇళ్లు కూడా కట్టాలని అనుకుంటున్నారు. కానీ ఇళ్లు కట్టాలంటే నిధులు కావాలి. అందుకే ఆర్ 5 జోన్ లో యాభై వేల ఇళ్లు కట్టేందుకు ప్రతిపాదనలు పంపారు. ఇప్పటి వరకూ కేంద్రం ఏపీకి ఇరవై లక్షల ఇళ్లు మంజూరు చేసింది కేంద్రానికి మాత్రం మరో యాభై వేల ఇళ్లకు ప్రతిపాదనలు పంపారు. అదీ కూడా ఆర్5 జోన్‌లో . సెంటు స్థలాలను అమరావతి రైతులు ఇచ్చిన భూములను ఇచ్చినప్పటికీ ఇళ్లు మాత్రం కేంద్ర నిధులతో నిర్మిస్తారు. కేంద్రం ఒక్కో ఇంటికి రూ. 1 లక్ష 80 వేలు ఇస్తుంది. అలాగే ప్రభుత్వం లబ్దిదారులకు పావలా వడ్డ కింద మరో రూ. 35వేలు ఇప్పిస్తోంది. ఈ మొత్తంతో ఇళ్లు నిర్మించాలని అనుకుంటున్నారు. అయితే ముందుగా వీటికి కేంద్రం మంజూరు చేయాల్సి ఉంటంది. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న భూములు వివాదంలో ఉన్నందున వాటిలో ఇళ్ల నిర్మాణానికి కేంద్రం అనుమతి ఇస్తుందా అన్నది సస్పెన్స్ గా మారింది. పేదలకు మేలు జరిగితే సరే లేకపోతే.. తర్వాత ఆయన పేదలతో రాజకీయం చేశారన్న విమర్శలను గట్టిగానే ఎదుర్కోవాల్సి ఉంటుంది.

# ఎర్రగంగిరెడ్డి బెయిల్ రద్దు

(మొదటిపేజీ తరువాయి)

వ్యక్తం చేసింది. ఎర్ర గంగిరెడ్డికి బెయిల్ మంజూరు చేయడంతో పాటు కస్టడీ తర్వాత విడుదల తేదీని ఖరారు చేస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు న్యాయశాస్త్రంలో ఎనిమిదో వింతలా ఉన్నాయని సీబీఐ న్యాయవాదులు సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. బెయిల్‌ను గంగిరెడ్డి దుర్వినియోగం చేసిన ఉదంతాలున్నాయని, సాక్షులను బెదిరించే అవకాశాలు ఉన్నాయని సునీతారెడ్డి తరపు న్యాయవాది వాదించారు. హత్యలు చేసిన వాళు బయట ఉంటే సమాజంలో తప్పుడు సంకేతాలు వెళతాయని న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. అంతకు ముందు ఎర్ర గంగిరెడ్డి బెయిల్ ఉత్తర్వులపై ఈ నెల 16న వైఎస్ సునతారెడ్డి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తెలంగాణ హైకోర్టు ఇచ్చిన బెయిల్ ఉత్తర్వులను సునీతా రెడ్డి సవాల్ చేశారు. తెలంగాణ హైకోర్టు ఇచ్చిన బెయిల్ ఉత్తర్వులపై సీజేఐ చంద్రచూడ్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి 2019 మార్చి 14న తన నివాసంలో హత్యకు గురయ్యారు. ఈ హత్య కేసులో ఏ 1 నిందితుడిగా ఎర్ర గంగిరెడ్డి ఉన్నారు. వివేకానందరెడ్డి హత్య కేసును అప్పట్లో సిట్ విచారించింది. అయితే సకాలంలో చార్జిషీట్ దాఖలు చేయలేదు. దీంతో ఎర్ర గంగిరెడ్డికి డిఫాల్ట్ బెయిల్ మంజూరైంది. ఆ తర్వాత చోటు చేసుకున్న పరిణామాలతో వివేకానందరెడ్డి హత్య కేసును సీబీఐ విచారిస్తుంది. ఏపీ హైకోర్టు ఆదేశాలతో ఈ కేసును సీబీఐ విచారిస్తుంది. వివేకానందరెడ్డి హత్య కేసులో ఏ1 నిందితుడు ఎర్ర గంగిరెడ్డి బెయిల్ రద్దు కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ బెయిల్ పిటిషన్ పై విచారణను తెలంగాణ హైకోర్టుకు సుప్రీంకోర్టు బదిలీ చేసింది. ఈ పిటిషన్ పై విచారించిన తెలంగాణ హైకోర్టు ఎర్ర గంగిరెడ్డి బెయిల్ ను రద్దు చేసింది. అందులో జూలై ఒకటిన విడుదల చేయాలని ఉండటంతో సునీత కోర్టుకెళ్లి డీఫాల్ట్ బెయిల్ మను రద్దు చేయించారు. =

# 75 రూపాయిల కాయిన్

(మొదటిపేజీ తరువాయి)

కార్యక్రమంలో ప్రధాని మోదీ రూ.75 కాయిన్‌ని విడుదల చేయనున్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తైన సందర్భంగా ఈ కాయిన్‌ని విడుదల చేయనున్నట్టు కేంద్ర ఆర్థిక శాఖ అధికారికంగా వెల్లడించింది. ప్రత్యేక నోటిఫికేషన్ కూడా విడుదల చేసింది. ఈ కాయిన్ వివరాలనూ వెల్లడించింది. 44 మిల్లీమీటర్ల డయామీటర్‌తో ఉంటుందని తెలిపింది. ఈ కాయిన్‌ని 50% వెండి, 40% రాగి, 5%నికెల్, 5% జింక్‌తో తయారు చేశారు. "కాయిన్‌పై అశోక పిల్లర్‌తో పాటు దానిపై పులి బొమ్మ ఉంటుంది. దాని కింద సత్యమేవ జయతే అనే నినాదం రాసి ఉంటుంది. ఎడమ వైపున "భారత్" అని మెన్షన్ చేశాం. ఇది దేవనాగరి లిపిలో ఉంటుంది. కుడివైపు ఇంగ్లీష్‌లో "ఇండియా" అని కనిపిస్తుంది. మరో వైపు పార్లమెంటరీ కాంప్లెక్స్ బొమ్మ ప్రింట్ అయ్యుంటుంది. పార్లమెంటరీ కాంప్లెక్స్ స్క్రిప్ట్‌పై సన్సన్ సంకుల్ అని రాసి ఉంటుంది."కొత్త పార్లమెంట్ ప్రారంభోత్సవంపై దేశవ్యాప్తంగా రాజకీయాలు ముదిరాయి. అన్ని పార్టీలనూ ఆహ్వానించామని బీజేపీ చెబుతున్నప్పటికీ.. ఈ కార్యక్రమానికి వచ్చేందుకు విపక్షాలు ఆసక్తి చూపించడం లేదు. దీనిపై బీజేపీ, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఇప్పుడీ వివాదం సుప్రీంకోర్టు గడప తొక్కింది. కొత్త పార్లమెంట్‌ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించాలని ఓ న్యాయవాది సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. పార్లమెంట్‌లో రాష్ట్రపతికి తగిన గౌరవం కల్పించాలని ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రపతిని ఆహ్వానించకుండా లోక్‌సభ సెక్రటేరియట్ రాజ్యాంగ విలువల్ని కించపరిచారని ఆరోపించారు. లాయర్ జయసుకిన్ ఈ పిటిషన్ వేశారు. ఇప్పటికే 19 పార్టీలు తాము హాజరు కావడం లేదని లెటర్ రాశాయి. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేత మాత్రమే పార్లమెంట్‌ని ఓపెన్ చేయించాలని డిమాండ్ చేశాయి. కానీ...బీజేపీ మాత్రం దీనిపై గట్టిగానే వాదిస్తోంది. అనవసరంగా రాజకీయం చేస్తున్నారని మండి పడుతోంది. ఈ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీతో పాటు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ పాల్గొంటారు. ఉదయం 7.30 గంటలకు హవన్ పూజ మొదలవుతుంది. 8.30 గంటల వరకూ ఇది కొనసాగుతుంది. 8.30 గంటల నుంచి 9 గంటల మధ్యలో సెంగోల్ ని లోక్‌సభలో పొందుపరచనున్నారు. ఈ మొత్తం తంతులో ఇదే హైలైట్ అవనుంది. ఆ తరవాత 12 గంటలకు పార్లమెంట్‌ని ప్రారంభించి ప్రసంగిస్తారు ప్రధాని.

# తిరుమలలో టెక్నాలజీ భద్రత....

**తిరుమల:**



ఆధునిక టెక్నాలజి సాయంతో తిరుమలలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపడతామన్నారు రాష్ట్ర హోంశాఖ ప్రధాన కార్యదర్శి హరీష్ కుమార్ గుప్తా. తిరుమలలో రెండు రోజులపాటు భద్రతాపరమైన అంశాలపై సమీక్ష నిర్వహించామని చెప్పారు. సీసీటీవీ కంట్రోల్ రూమ్ లో కృత్రిమ మేధను ఎలా వినియోగించాలి, ఎలాంటి సాఫ్ట్‌వేర్‌లు వాడాలి అనే అంశాలపై అధ్యయనం చేస్తామన్నారు. అదేవిధంగా యాంటీ డ్రోన్ టెక్నాలజీ, బాడీ స్కానర్స్ వినియోగంపై ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని తెలిపారు. తిరుమలలోని వైకుంఠం క్యూ కాంప్లెక్స్ -1 ను పరిశీలించారు.తిరుమలలో భద్రతను మరింత కట్టుదిట్టం చేసేందుకు క్షేత్రస్థాయిలో పరిశీలన జరపడానికి ఎస్పీ లేదా ఏఎస్పీ స్థాయి అధికారి ఆధ్వర్యంలో ఏడు కమిటీలు ఏర్పాటు చేశామన్నారు డీఐజీ అమ్మిరెడ్డి. ఈ కమిటీల్లోని అధికారులు 15 రోజుల పాటు పరిశీలన జరిపి నివేదిక సిద్ధం చేస్తారని.. మరోసారి సమావేశమై సమీక్షిస్తామని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తర్వాత కమిటీలు చేసిన సూచనలను క్షేత్రస్థాయిలో అమలు చేస్తామన్నారుఅంతకుముందు తిరుమల శ్రీవారి ఆలయం, కొత్త పరకామణి భవనం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్-1, కమాండ్ కంట్రోల్ రూమ్ తదితర ప్రాంతాలను పోలీసు ఉన్నతాధికారులు పరిశీలించి భద్రత అంశాలను తనిఖీ చేశారు. కమాండ్ కంట్రోల్ రూమ్ లో తిరుమలలో సీసీ కెమెరాల ద్వారా నేరస్తులను గుర్తించే విధానాన్ని పరిశీలించారు. తిరుమల అన్నమయ్య భవనంలో టీటీడీ సీవీఎస్వో నరసింహ కిషోర్, ఇంటెలిజెన్స్ ఎస్పీ సుమిత్ ఆధ్వర్యంలో ఉన్నత స్థాయి సమావేశం జరిగింది.మరోవైపు తిరుమలలో భద్రతాపరమైన అంశాలపై తిరుమల అన్నమయ్య భవన్‌లో ఉన్నత స్థాయి సెక్యూరిటీ ఆడిట్ జరిగింది. కోవిడ్ అనంతరం తిరుమలకు యాత్రికులు పెరగడం, వాహనాల రద్దీ పెరగడంతో భద్రతను ఎలా పెంచాలనే విషయమై చర్చించడానికి టీటీడీ భద్రతాధికారులు, పోలీసు శాఖ, ఇతర శాఖల ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు. తిరుమలకు పటిష్టమైన భద్రత కోసం అన్ని దళాలను ఒకే గొడుగు కిందకు తీసుకురావాలని హరీష్ కుమార్ గుప్తా అభిప్రాయపడ్డారు. అంతకుముందు, టీటీడీ సీవీఎస్వో శ్రీ నరసింహ కిషోర్, తిరుపతి ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి వేర్వేరుగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. తిరుమలకు సంబంధించి ఇప్పటికే ఏర్పాటు చేసిన భద్రత, ఇంకా భద్రతను మరింత పటిష్టం చేయవలసిన ప్రదేశాల గురించి తెలియజేశారు.అలిపిరి సప్తగిరి టోల్‌గేట్ దగ్గర టీటీడీ ఉద్యోగులను, కూరగాయల వాహనాలను, కార్గో వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని.. ఆ తర్వాతనే తిరుమలకు అనుమతించాలని.. అప్పుడే నిషేధిత వస్తువులను అరికట్టగలమన్నారు. తిరుమలలో శాంతి భద్రతల కోసం క్రైమ్ పార్టీ, ఐడి పార్టీలను బృందాలుగా ఏర్పాటు చేసి ముందస్తు సమాచార వ్యవస్థను బలోపేతంతో కట్టడి చేస్తున్నామన్నారు. తిరుమల పుణ్యక్షేత్రం నందు ఎమర్జెన్సీ అలారం సిస్టంను ఏర్పాటు చేసేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించుటకై కమిటీ ఏర్పాటు చేయనున్నారు. ఇలా చాలా నిర్ణయాలు తీసుకున్నారు.

# వందేభారత్ లో స్లీపర్ కోచ్

(మొదటిపేజీ తరువాయి)

తిరుపతి మధ్య నడిచే రైలును ప్రారంభించిన విషయం తెలిసిందే.పగటి వేళ నడిచే రైళ్లు అయినప్పటికీ ఈ రెండు సర్వీసులు విజయవంతమయ్యాయి. వాటిల్లో ఆక్యుపెన్సీ రేషియో 110 శాతం నుంచి 140 శాతంగా నమోదవుతోంది. ఇలా దేశవ్యాప్తంగా చాలా వందేభారత్ రైళ్లు విజయవంతంగా నడుస్తున్నాయి. అయితే, వీటిల్లో బెర్తులు లేకపోవటంతో ప్రయాణికులు కూర్చునే వెళ్లాల్సి వస్తోంది. దీంతో ఎనిమిది గంటల్లో గమ్యం చేరేలా సమయాలను సెట్ చేశారు.దూర ప్రాంత నగరాల మధ్య నడపాలంటే, సమయం ఎక్కువ పడుతుంది, అంతసేపు కూర్చోవటం సాధ్యం కానందున కేవలం దగ్గరి నగరాల మధ్యనే తిప్పుతున్నారు. అయితే వీటిల్లో బెర్తులు ప్రవేశపెట్టి దూర ప్రాంత నగరాల మధ్య రాత్రింబవళ్లు తిప్పాలని రైల్వే నిర్ణయించింది. పగటి వేళ చైర్ కార్‌తో తిరిగేలా డబుల్ డెక్కర్ రైళ్లను ప్రవేశపెట్టారు. అన్ని వసతులు మెరుగ్గానే ఉన్నప్పటికీ వీటి వేగం సాధారణ రైళ్లలాగే ఉండేది. దీంతో గంటల తరబడి పగటి వేళ కూర్చుని ప్రయాణించేందుకు ప్రయాణికులు విముఖత చూపటంతో ఆ కేటగిరీ విజయం సాధించలేదు. వందేభారత్ రైళ్లు మాత్రం శతాబ్ది లాంటి ప్రీమియం రైళ్ల కంటే ఎక్కువ వేగంతో ప్రయాణించే వీలుండటంతో వీటి ప్రయాణ సమయం బాగా తక్కువగా ఉంది.ఈ కేటగిరీ సక్సెస్‌కు ఇదే ప్రధాన కారణం. దీంతో తదుపరి స్లీపర్ కేటగిరీ రైళ్లు మరింత వేంగంగా ప్రయాణించేలా ప్లాన్ చేస్తున్నారు. వాటి గరిష్ట వేగం దాదాపు 200 కి.మీ. మించి ఉంటుందని తాజాగా రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించటం ఆసక్తిని రేపుతోంది. అంత వేగంతో దూసుకుపోయేలా దీని డిజైన్‌ను రూపొందించనున్నారని, ఇది ప్రస్తుత వందేభారత్ రైళ్లకు భిన్నంగా ఉంటుందని పేర్కొంటున్నారు. దేశంలోని అన్ని కోచ్ ఫ్యాక్టరీల్లో వందేభారత్ రైళ్లను రూపొందిస్తున్న విషయం తెలిసిందే. వాటిల్లో కొత్త రైలు నమూనాలను రూపొందించే పని ప్రారంభించినట్టు సమాచారం. మార్చి నాటికి నమూనా రైలును కూడా సిద్ధం చేసి కొన్ని నెలల పాటు ప్రయోగాత్మకంగా తిప్పాలని భావిస్తున్నారు. వందేభారత్ రైలు 2018లో రూపొందినా. . దాదాపు ఏడాదిన్నర పాటు దాన్ని పరిశీలించి పలు మార్పులు చేస్తూ వచ్చారు. కొత్త రైలుకు కూడా అలా పరిశీలించి మార్పులు చేసి, లోపాలు లేకుండా ప్రారంభించాలని భావిస్తున్నారు.

# సాయి వర్షిత్ చుట్టూ బిగిస్తున్న ఉచ్చు

**న్యూయార్క్ :**

అమెరికా అధ్యక్ష భవనం శ్వేతసౌధంపై ట్రక్కుతో దాడికి ప్రయత్నించిన భారతీయ సంతతి యువకుడు సాయి వర్షిత్ కందులను పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. పోలీసుల విచారణలో తెలుగు యువకుడు సంచలన విషయాలు వెల్లడించాడు. వైట్‌హౌస్‌ను నియంత్రణలోకి తీసుకొని అధికారాన్ని స్వాధీనం చేసుకోవాలనే.. తాను దాడికి పాల్పడ్డానని తెలిపాడు. ఈ క్రమంలో అవసరమైతే అధ్యక్షుడు జో బైడెన్.. అడ్డం వచ్చే ఎవరినైనా చంపేందుకు వెనుకాడకూడదని నిశ్చయించుకున్నట్టు పేర్కొన్నారు.మిసోరిలోని ఛెస్టర్‌ఫీల్డ్‌కు చెందిన సాయి వర్షిత్.. సెయింట్ లూయిస్‌లో విమానం ఎక్కి వాషింగ్టన్ డీసీలోని డలెస్ అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగాడు. అక్కడే ఓ ట్రక్కును అద్దెకు తీసుకుని నేరుగా వైట్‌హౌస్ ఉత్తరభాగంలోని లాఫియెట్ పార్క్‌కు చేరుకున్నాడు. స్థానిక కాలమానం ప్రకారం రాత్రి 9.35 గంటలకు పార్క్ సమీపంలోని బారికేడ్లను తొలుత ఢీకొట్టాడు. ట్రక్కును వెనక్కి మళ్లించి రెండోసారి ఢీకొట్టే ప్రయత్నం చేస్తున్న సమయంలో వర్షిత్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.ప్రమాదకరమైన ఆయుధంతో దాడి, మోటారు వాహనం నడపడంలో నిర్లక్ష్యం, అధ్యక్షుడిని, ఉపాధ్యక్షురాలిని, వారి కుటుంబ సభ్యులను చంపుతానని, కిడ్నాప్ చేస్తానని, గాయపరుస్తానని బెదిరించడం. ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించడం తదితర అభియోగాలను నమోదు చేశారు. తెలుగు కుటుంబానికి చెందిన సాయివర్షిత్.. 2022లో మార్క్వెట్ సీనియర్ హైస్కూలు నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాడు. ప్రోగ్రామింగ్, కోడింగ్ లాంగ్వేజీలపై అవగాహన ఉన్న సాయి.. డేటా అనలిస్ట్‌గా కెరీర్‌ను ఎంచుకోవాలని చూస్తున్నట్లు లింక్డిన్ ప్రొఫైల్ ద్వారా తెలిసింది.అయితే, అతడిపై ఇప్పటివరకు ఎలాంటి క్రిమినల్ రికార్డ్ లేదని పోలీసులు తెలిపారు. అటు, సాయివర్షిత్ స్నేహితులు ఈ సంఘటనపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు.చాలా మంచి వ్యక్తి అని.. సరదాగా ఉంటాడని వర్షిత్‌తో కలిసి చదువుకున్న ఈరియన్ బార్‌ఫీల్డ్ అనే యువకుడు తెలిపారు. తను మానసికంగా సంఘర్షణకు గురైనట్లు ఉన్నాడని, లేకపోతే కుటుంబంలో ఏమైనా సమస్యలు ఉన్నాయేమో అని మరో స్నేహితుడు పేర్కొన్నాడు. వైట్ హౌస్'విషయంలో తన లక్ష్యం నెరవేరిందని, ఎందుకంటే సీక్రెట్ సర్వీస్ వంటి దర్యాప్తు సంస్థలకు మెసేజ్ పంపడమే తన ఉద్దేశమని సాయి వెల్లడించినట్టు పోలీసులు పేర్కొన్నారు. ఈ దాడికి ఆరు నెలల నుంచి ప్రణాళిక రచిస్తున్నట్టు బయటపెట్టాడు. 'వైట్‌హౌస్‌లోకి వెళ్లి అధికారాన్ని స్వాధీనం చేసుకోవడమే నా లక్ష్యం' అని చెప్పాడు.ఈ సమయంలో అధికారాన్ని ఎలా చేజిక్కించుకుంటావని సీక్రెట్ సర్వీస్ ఏజెంట్స్ ప్రశ్నించడంతో.. "అవసరమైతే బైడెన్‌ను చంపేయాలనుకున్నా. లేదా అక్కడున్న వారిలో ఎవరినైనా గాయపర్చడమో, చంపడమో చేయాలనుకున్నా" అని వర్షిత్ బదులిచ్చినట్లు అధికారులు తెలిపారు. నిందితుడి వద్ద నాజీ జెండాను స్వాధీనం చేసుకున్న పోలీసులు.. అది ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు.'జర్మనీ నియంత హిట్లరంటే తనకు ఇష్టమని.. ఆయన బలమైన నేత. నాజీలకు గొప్ప చరిత్ర ఉంది' అని నిందితుడు చెప్పినట్లు అధికారులు తెలిపారు. తనను అరెస్ట్ చేస్తారని, అయితే తన 'పుస్తకం' చూడాల్సిన వారికి అందుతుందని కందుల పోలీసులకు చెప్పారు. వైట్‌హౌస్‌లోకి ప్రవేశించడం, అధ్యక్షుడిగా ఉంటే ఏం సాధించాలని అనేవి'గ్రీన్ బుక్' రూపంలో తన ఆలోచనలను గత ఆరు నెలలుగా రాయడం ప్రారంభించినట్టు విచారణలో వెల్లడించాడు. దీంతో సాయి వర్షిత్ మానసిక పరిస్థితిపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇందుకోసం అతడి ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను విచారించినట్లు తెలుస్తోంది.

# గ్రూప్-1, గ్రూప్-2 నోటిఫికేషన్లకు గ్రీన్ సిగ్నల్

(మొదటిపేజీ తరువాయి)

నుంచి ఖాళీల వివరాలు తెప్పించుకున్నామని వెల్లడించారు. నోటిఫికేషన్ జారీకి అవసరమైన కసరత్తు తుదిదశలో ఉందని తెలిపారు. గ్రూప్-1కి సంబంధించి సుమారు 100కిపైగా పోస్టులు, గ్రూప్-2కు సంబంధించి సుమారు 900కిపైగా పోస్టులు, మొత్తంగా 1000కిపైగా పోస్టులు భర్తీచేయనున్నామని తెలిపారు. వీలైనంత త్వరలో దీనికి సంబంధించి నోటిఫికేషన్ జారీచేయాలని సీఎం ఆదేశించారు. పరీక్షల నిర్వహణ, ఫలితాలు వెల్లడి తదితర అంశాలపైనా దృష్టిసారించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

## నీతి అయోగ్ కు కేసీఆర్ డుమ్మా...

**హైదరాబాద్ :**
27న న్యూఢిల్లీలో ప్రధాని మోదీ అధ్యక్షతన జరగనున్న నీతి ఆయోగ్ సమావేశానికి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరవ్వడం లేదు. నీతి ఆయోగ్ సమావేశాలు పనికిమాలినవని ఇప్పటికే సీఎం కేసీఆర్ ఆరోపణలు చేశారు. ఆ అభిప్రాయంతోనే ఉన్న ఆయన తాజా సమావేశాలకు కూడా హాజరవ్వడం లేదు. ఈసారి మంత్రులు, అధికారులను కూడా పంపించే అవకాశం లేదని అంటున్నారు. తెలంగాణపై కేంద్రం కక్షపూరితంగా వ్యవహరిస్తున్నప్పుడు ఈ సమావేశానికి హాజరయ్యే ప్రసక్తే లేదని కేసీఆర్ గురువారం ఓ సమావేశంలో చెప్పినట్లు విశ్వసనీయ సమాచారం.మే 27న నీతి ఆయోగ్ ఎనిమిదో పాలక మండలి సమావేశం జరగనుంది. దీనికి ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షత వహించనున్నారు. ఇందులో ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధి, మహిళా సాధికారత మరియు మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి అనేక అంశాలపై చర్చించనున్నారు. కేసీఆర్ చివరిసారిగా 2018లో జరిగిన ఒక సమావేశానికి హాజరయ్యారు. ఇక గత కొన్నేళ్లుగా నీతి ఆయోగ్ సమావేశాలకు హాజరుకావడం మానేశారు. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డి హాజరవనున్నారు. ఈ నేపథ్యంలో ఆ సమావేశంలో చర్చించనున్న అంశాలపై ఆయన తన క్యాంపు కార్యాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. నీతి ఆయోగ్ పాలక మండలి సమావేశంలో ప్రస్తావించాల్సిన అంశాలపై పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.

## రోజుకు 50కు పైగానే సైబర్ చీట్స్

**హైదరాబాద్:**
సైబర్ నేరగాళ్లు రోజు రోజుకు రెచ్చిపోతున్నారు. కొత్త కొత్త స్కీములతో ఆశలు చూపించి అమాయక ప్రజలను అడ్డంగా దోచుకుంటున్నారు. దీంతో భాదితుల సంఖ్య కూడా రోజు రోజుకు పెరుగుపోతుంది. లేటెస్ట్ టెక్నాలజీ వాడకంతో సైబర్ నేరగాళ్ల పని కూడా చాలా సులువుగా మారింది. కోణాల్లో అమాయకుల ఖాతాల నుండి లక్షల్లో డబ్బు మాయం చేస్తున్నారు.కేవలం సైబర్ నేరాలకు సంబంధించి గ్రేటర్లోని ట్రై పోలీస్ కమిషనరేట్స్ పరిధిలో రోజుకు 40-50 ఫిర్యాదులు అందుతున్నాయని సమాచారం. ఒక్కో బాధితుడు రూ. లక్ష నుంచి రూ.25 లక్షల వరకు పోగొట్టుకుంటున్న సందర్భాలు కూడా ఉన్నాయి. కష్టపడి సంపాదించుకున్న డబ్బు క్షణాల్లో మాయం అవడంతో భాదితులు లబోధిబో అంటున్నారు. పోలీసులకు కూడా సైబర్ నేరాలు పెద్ద సవాల్గా మారుతున్నాయి. వేరే రాష్ట్రాల్లో ఉంటూ ఆన్లైన్ వేదికగా అడ్డంగా దోచేస్తున్నారు కేటుగాళ్లు.ఇల్లాంటి వాళ్ళని పట్టుకోవడానికి పోలీసులు ఇతర రాష్ట్రాలకు వెళ్లి నెల రోజులపాటు మకాం వేసి నిందితులను పట్టుకోవాల్సిన పరిస్థితి. ఈలోగా వందల సంఖ్యలో కేసులు నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఏడాదిలో కనీసం 5 శాతం కేసులను కూడా ఛేదించలేని పరిస్థితి నెలకొందని సైబర్ క్రైమ్ పోలీసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఈ నేరాలను ఎలా కట్టడి చేయాలో తెలియాక తలలు పట్టుకుంటున్నారు సైబర్ క్రైమ్ పోలీసులు.

## నత్త నడకన తోటపల్లి ఎడమ కాలువ పనులు..

**శ్రీకాకుళం**

పాలకొండ నియోజకవర్గం తోటపల్లి ఎడమ కాలువ పనులు గత నాలుగు సంత్సరాలుగా నత్త నడక నడుస్తున్నాయి. ఈ పనులుతో రైతులు నాలుగు సంత్సరాలు నుంచి ఏ ఒక్క సంత్సరం కూడా వేసవి పంట పండించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే పాడి రైతులు ఇబ్బందులు పడటమే కాకుండా, నీరు లేకపోతే ఏ ఒక్క పంట పండించుకోలేకపోతున్నామని, రైతులు వాపోయారు. కనీసం కూలి పనులు కూడా చేసుకోవడానికి పనులు దొరకక గ్రామలన్ని విడిచి వలస వెళ్ళే పరిస్థితి ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి రైతులకు నీరు వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని జనసేన నాయకులు జానీ డిమాండ్ చేశారు.

## దొంగిలించిన ట్రాక్టర్ బోల్తా..వ్యక్తి మృతి

**మెదక్**

నిజాంపేట (మం) కల్వకుంట్ల గ్రామంలో ట్రాక్టర్ బోల్తా పడి మృతి చెందిన వ్యక్తి కేసు మరో మలుపు తిరిగింది. బోల్తా పడ్డ ట్రాక్టర్ ని గురువారం ఎవరో దొంగలించారని సిద్దిపేట జిల్లా భూంపల్లి పోలీస్ స్టేషన్ లో ట్రాక్టర్ యజమాని ఫిర్యాదు చేసాడు. శుక్రవారం ఉదయం కల్వకుంట్ల గ్రామ శివారులో ట్రాక్టర్ బోల్తా పడి రాజు అనే వ్యక్తి మృతి చెందాడు .రాజునే ట్రాక్టర్ దొంగతనం చేశాడా..లేదా ఇంకెవరైనా చేయించారా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## తూళ్లూరులో ఉద్రికత్త

**తాడేపల్లి**

తుళ్ళూరు దీక్షా శిబిర వద్ద ఉదృత్త వాతావరణం నెలకొంది. నల్ల బెలూన్లతో రైతులు రోడ్డుపైకి ఒక్కసారిగా దూసుకొచ్చారు. సీఎం డౌన్ డౌన్ అంటూ పెద్దఎత్తున నినాదాలు చేసారు. రైతులకు నినాదాలు చేస్తున్న తరుణంలో జై జగన్ అంటూ గుర్తు తెలియని వ్యక్తి నినాదాలు చేయడంతో రైతులు మరింత మండిపడ్డారు. ఆక్రోశంతో రైతులు ఆ వ్యక్తిపై ఆక్రోశంతో దాడి చేసారు. పోలీసుల సాయంతో వ్యక్తిని సురక్షిత ప్రాంతానికి తరలించారు. చివరకు పోలీసులు రైతులను కట్టడి చేసారు.

# దుర్గా దేవస్థానం కాదు.. సూర్య ఆలయం

**విజయవాడ :**

విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మ ఆలయ బస్సు టికెట్పై వివాదం మొదలైంది. ఏకంగా ఆలయం పేరు మార్చేశారంటూ టీడీపీ జగన్ సర్కార్ను టార్గెట్ చేసింది. 'చివరకు రాష్ట్రంలో ఉన్న ప్రముఖ దేవాలయాల పేర్లు కూడా మార్చేస్తున్నారు. బెజవాడలో ఇంద్రకీలాద్రి పై కొలువై ఉన్న కనకదుర్గమ్మ పేరున ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం పేరుని శ్రీ సూర్య మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంగా మార్చి, టికెట్లు ఇస్తున్నారు. నీ సైకో బుద్ధులకు అంతే లేదా, జగన్ రెడ్డి ?' అంటూ ఘాటుగా స్పందించింది.విజయవాడ దుర్గమ్మ దర్శనానికి వెళ్లే భక్తుల కోసం దేవస్థానం బస్సులు నడుస్తున్నాయి. ఆలయానికి సంబంధించి మొత్తం తొమ్మిది బస్సులు ఉన్నాయి.. అందులో నాలుగు బస్సులను ప్రతి రోజూ విజయవాడ రైల్వేస్టేషన్, బస్టాండ్ నుంచి ఇంద్రకీలాద్రిపై దుర్గగుడికి నడుస్తున్నాయి. మరో మూడు బస్సులను కొండ దిగువన ఉన్న దుర్గాఘాట్ నుంచి నడుస్తున్నాయి. రెండు బస్సులు స్టాండ్ బైగా ఉంచింది దేవస్థానం. ఈ బస్సుకు టికెట్ ధర రూ.10 నిర్ణయించారు. ఈ టికెట్ విషయంలోనే వివాదం మొదలైంది. టికెట్పై శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం బదులుగా శ్రీ సూర్య మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం పేరుతో ప్రింట్ చేశారు. మిగిలిన వివరాలను కూడా ప్రస్తావించారు. అయితే దుర్గా మల్లేశ్వర స్వామి పేరు బదులు శ్రీ సూర్య మల్లేశ్వర స్వామి పేరును ప్రింట్ చేయడంపై విమర్శలొస్తున్నాయి. ఈ విషయాన్ని టీడీపీతో పాటూ మరికొందరు ట్వీట్ చేశారుఆలయం పేరును మార్చేశారని.. ఈ తప్పు పొరపాటున జరిగిందా లేక ఇంకేదైనా కారణం ఉందా అనే చర్చ జరుగుతోంది. ఒకవేళ పొరపాటున జరిగితే వెంటనే ఈ ప్రింటింగ్ రోల్ను వెంటనే తొలగించాలని కోరుతున్నారు. ఈ టికెట్పై ఆలయం పేరు మార్చడంపై కొందరు నెటిజన్లు మండిపడుతున్నారు. సోషల్ మీడియాలో ఈ టికెట్ వైరల్ అవుతోంది.ఈ బస్సులు ప్రతి రోజూ ఉదయం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు రైల్వేస్టేషన్, బస్టాండ్ దుర్గగుడి మధ్య బస్సులు సర్వీసులు నడిపిస్తున్నారు. పండుగల సమయంలో, రద్దీ ఉన్నప్పుడు ట్రిప్పుల సంఖ్యను పెంచుతారు. ఈ బస్సుల్లో విజయవాడ బస్టాండ్, రైల్వేస్టేషన్, దుర్గాఘాట్ నుంచి రూ.10 టికెట్ వసూలు చేస్తారు. అయితే గతంలో ఈ రూ.10ని కూడా రద్దు చేయాలని ప్రతిపాదనలు తెచ్చారు. మరి ఈ టికెట్ వ్యవహారంపై దేవస్థానం స్పందించాల్సి ఉంది.

# స్పీకర్ పక్కనే రాజదండం

**న్యూఢిల్లీ:**

నూతన పార్లమెంట్ భవనంలో లోక్సభ స్పీకర్ కుర్చీ పక్కన రాజదండం ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ప్రకటించింది. అప్పటి నుంచి రాజదండంపై తీవ్ర చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో రాజదండం ఏర్పాటుపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించడం వెనక ప్రముఖ నృత్యకారిణి పద్మా సుబ్రహ్మణ్యం ఉన్నట్టు తెలిసింది. ఆమె అభ్యర్థన మేరకే 1947లో కనుమరుగైన రాజదండం.. ఇప్పుడు పార్లమెంట్లో కొలువు తీరబోతోంది. రాజదండం గురించి ఓ తమిళ పత్రికలో వచ్చిన కథనాన్ని ఆంగ్లంలోకి ఆమె అనువాదం చేసి ప్రధాని మోదీకి పంపారు. దీనికి సంబంధించిన వివరాలను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మీడియాకు నాడు వెల్లడించారు.'దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన చరిత్రాత్మక ఘడియల్లో అప్పటి మద్రాస్ రాష్ట్రం కీలక పాత్ర పోషించింది.. బ్రిటిషర్ల నుంచి అధికార బదిలీకి నిదర్శనంగా ఏం చేద్దామని భారత మొదటి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ.. సి. రాజగోపాలాచారితో చర్చించారు.. 8వ శతాబ్దంలో చోళుల కాలం నుంచి రాజదండం చేతుల మారడం ద్వారా అధికార మార్పిడి జరుగుతూ వచ్చిన విషయాన్ని రాజాజీ వెల్లడించారు.. అలా 1947 ఆగస్టు 15న బ్రిటిషర్ల నుంచి జవహర్లాల్ నెహ్రూ రాజదండాన్ని అందుకున్నారు.. ఈ రాజదండం గురించి 2021 ఫిబ్రవరిలో ఓ తమిళ పత్రిక కథనాన్ని ప్రచురించింది.. దానిని నృత్యకారిణి పద్మా సుబ్రహ్మణ్యం ఆంగ్లంలోకి తర్జుమా చేసి, ప్రధాన మంత్రి కార్యాలయానికి పంపి అది ఎక్కడో ఉందో తెలుసుకోవాలని అభ్యర్థించారు.. అనంతరం దానిని ప్రయాగరాజ్లోని ఆనంద భవన్ మ్యూజియంలో గుర్తించాం' అని నిర్మలా సీతారామన్ తెలిపారు అంతేకాదు, దాని జాడ తెలుసుకునేందుకు రెండు సంవత్సరాలు పట్టిందని పేర్కొన్నారు. కొత్త పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవం సందర్భంగా ఈ రాజదండాన్ని ఆవిష్కరణఖు ముందు జరిగే ప్రక్రియ గురించి కూడా ఆమె వివరించారు. ఆ వేడుకకు తిరువడుతురై ఆధీనానికి (శైవమతం) చెందిన స్వామిజీలు హాజరుకానుండగా.. ప్రక్రియ అంతా ద్రవిడ సంప్రదాయంలో జరగనుంది. అనంతరం ఒక స్వామిజీ శుద్ధి చేసిన రాజదండాన్ని ప్రధానికి అందజేస్తారని, ఆయన దానిని స్పీకర్ ఛైర్ పక్కన ఆవిష్కరిస్తారని తెలుస్తోంది. మొత్తం 20 మంది స్వామిజీలను అహ్వానించామని, పార్లమెంట్ భవనంలో ఆ రోజంతా శివనామస్మరణ చేస్తారని కేంద్ర మంత్రి తెలిపారు. ఇక, రాజదండాన్ని తయారుచేసి ఉమ్మిడి బంగారు జ్యువెల్లర్స్ను కూడా కార్యక్రమానికి ఆహ్వానించారు. తమిళ ఆలయ గాయకులు 'కొలారు పదిగమ్' నాదస్వరం కూడా ఏర్పాటు చేశారు.భారత్కు స్వాతంత్ర ప్రకటన సమయంలో సెంగోల్ స్వీకరణ ఘట్టాన్ని ప్రపంచ వ్యాప్తంగా మీడియా ప్రచురించింది. ప్రఖ్యాత టైం మేగజీ న్తోపాటు పలు అంతర్జాతీయ పత్రికలు గ్రాఫిక్స్తో దీనిపై కథనాలు వెలువరించాయి. దేశీయ పత్రికలు కూడా దీనికి అదే గౌరవాన్ని ఇచ్చాయి.ఇక, పద్మా సుబ్రమణ్యం ప్రముఖ భరతనాట్య కళాకారిణి. ఆమె తండ్రి సినీ నిర్మాత కాగా.. తల్లి సంగీతకారిణి. ఆమె 14 ఏళ్ల వయస్సు నుంచే ఇతరులకు నాట్యాన్ని నేర్పించడం మొదలుపెట్టారు. ఎన్నో నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. భరత నాట్యానికి ఆమె చేసిన సేవలకుగానూ పద్మశ్రీ, పద్మభూషణ్ సహా పలు అవార్డులు వరించాయి.

# టీ కాంగ్రెస్ నేతల ఐక్యతా రాగం

**మహబూబ్ నగర్ :**

రాష్ట్రంలో తమ పార్టీ అధికారంలోకి వస్తే రూ. 500లకే పేదలకు వంట గ్యాస్ సిలిండర్ అందిస్తామని తెలంగాణ కాంగ్రెస్ నేతలు ప్రకటించారు. కేజీ టు పీజీ ఉచిత, నాణ్యమైన ఇంగ్లిష్ మీడియం విద్య అందిస్తామని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగులకు నెలకు రూ. 4 వేల చొప్పున భృతి సహా కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పెట్టనున్నట్లు చెప్పిన 10 హామీలను ప్రకటించారు. భట్టి విక్రమార్క పాదయాత్ర 800 కి.మీ. పూర్తయిన సందర్భంగా జడ్చర్లలో రాజీవ్ గాంధీ మైదానంలో కాంగ్రెస్ పార్టీ 'పీపుల్స్ మార్చ్' పేరుతో భారీ బహిరంగ సభ నిర్వహించింది. కర్ణాటక ఎన్నికల ప్రభావమో, స్వతహాగా మేల్కొలుపో తెలియదు గానీ.. కాంగ్రెస్ నేతలందరూ విభేదాలను పక్కనబెట్టి ఈ సభా వేదికగా ఏకతాటిపైకి వచ్చారు. కేడర్కు సానుకూల సంకేతాలను అందించగలిగారు. జిల్లాల వారీగా గెలిపించుకోవాల్సిన స్థానాలపై కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రేవంత్ రెడ్డి సవాళ్లు, ప్రతి సవాళ్లు విసురుకొని కార్యకర్తల్లో ఉత్సాహం పెంచారు. ప్రజా యుద్ధనౌక గద్దర్ పాటలతో హుషారెత్తించారు.అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్న వేళ కాంగ్రెస్ పార్టీ ఈ సభను ప్రతిష్టాత్మకంగా తీసుకొని నిర్వహించింది. హిమాచల్ ప్రదేశ్ సీఎం సుఖ్వీందర్ సింగ్ సుక్కు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కాంగ్రెస్ వ్యవహారాల రాష్ట్ర ఇన్ఛార్జి మాణిక్రావు ఠాక్రే, ఏఐసీసీ కార్యదర్శి బోసురాజు పాల్గొన్నారు. తెలంగాణ నుంచి పార్టీ సీనియర్ నేతలందరూ హాజరయ్యారు.రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ అప్పుల కుప్పగా మార్చారని దుయ్యబట్టారు. పాదయాత్రలో గిరిజనుల కష్టాలు చూశానని తెలిపిన భట్టి విక్రమార్క.. కాంగ్రెస్ పార్టీ పంచిన అటవీ భూములను కేసీఆర్ గుంజుకున్నారని ఆరోపించారు. పాదయాత్రలో పోడు భూముల పట్టాలను గిరిజనులు తనకు చూపించారని తెలిపారు. ప్రజలకు స్వేచ్ఛ లేకుండా పోయిందన్నారు. ధరణిలో భూముల వివరాలు కనిపించట్లేదని రైతులు ఆందోళన చెందుతున్నారని భట్టి తెలిపారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే పేదలకు ఇల్లు కట్టుకునేందుకు రూ. 5 లక్షల చొప్పున ఇస్తామని భట్టి విక్రమార్క ప్రకటించారు. రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పి, కేసీఆర్ మోసం చేశారని.. తాము అధికారంలోకి రాగానే రూ. 2 లక్షల చొప్పున రుణమాఫీ చేస్తామని చెప్పారు. ఆరోగ్యశ్రీ ద్వారా రూ. 5 లక్షల వరకు వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు.భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి నల్గొండ జిల్లాలో 12కు 12 స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తామని ప్రకటించారు. పాలమూరు జిల్లాలో 14కు 12 స్థానాలను గెలిపిస్తారా అంటూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు. అనంతరం మాట్లాడిన రేవంత్ రెడ్డి ఆ సవాల్ను స్వీకరించారు. పాలమూరులో 14కు 14 స్థానాల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తామని తెలిపారు. కార్యకర్తలు దీన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.'తెలంగాణ రాష్ట్రం వస్తే పాలమూరు జిల్లాను అభివృద్ధి చేస్తామని కేసీఆర్ మాట ఇచ్చారు. కానీ, తెలంగాణ వచ్చినా, పాలమూరులో వలసలు ఇంకా ఆగలేదు. నిరుద్యోగులు, రైతుల ఆత్మహత్యలు ఆగలేదు. కేసీఆర్ కుటుంబం రాజ్యాలు ఏలితే.. బడుగు బలహీనవర్గాల బిడ్డలు కులవృత్తులు చేసుకోవాలా? గొర్లు, బర్లు మేపడానికి కాదు, తెలంగాణ తెచ్చుకుంది' అని రేవంత్ రెడ్డి అన్నారు. పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని ఎవరు అడ్డుకున్నారని ఆయన ప్రశ్నించారు. 'నల్లమల అడవుల్లో పుట్టిన మీ బిడ్డ పీసీసీ అధ్యక్షుడిగా మీ ముందు నిలబడటానికి సోనియా గాంధీ అవకాశం ఇచ్చారు. నేను మీరు నాటిన మొక్కను. ఇవాళ పీసీసీ అధ్యక్షుడిగా మీ ముందున్నా. ఇది మిడ్జిల్ మండల, పాలమూరు ప్రజల గొప్పదనం. మీ బిడ్డకు అవకాశం వచ్చింది. ఇది మన ఆత్మగౌరవ సమస్య. పాలమూరు జిల్లా నుంచి 14కు 14 ఎమ్మెల్యే స్థానాలు, రెండు ఎంపీ స్థానాలు గెలిపించాలి' అంటూ కాంగ్రెస్ కార్యకర్తలకు రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

## ప్రధాని హత్య చేస్తామంటూ ఢిల్లీ పోలీస్ కంట్రోల్ రూమ్కు బెదిరింపు కాల్

**న్యూఢిల్లీ :**
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ని హత్య చేస్తామంటూ ఢిల్లీ పోలీస్ కంట్రోల్ రూమ్కు శుక్రవారంనాడు బెదిరింపు ఫోన్ కాల్ వచ్చింది. ఒక అజ్ఞాత వ్యక్తి నుంచి ఈ ఫోన్ కాల్ రావడంతో పోలీసు శాఖ వెంటనే అప్రమత్తమైంది. ఫోన్ ఎక్కడి నుంచి వచ్చిందో తెలుసు కునేందుకు పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. ఫోన్ కాల్ను ట్రేస్ చేసి ఢిల్లీలోని కరోల్ బాగ్లోని ప్రసాద్ నగర్కు చెందిన ఒకరిని అరెస్టు చేశారు. ఆ వ్యక్తిని య్‌గర్ పురకు చెందిన హేమంత్గా గుర్తించారు. తప్పతాగిన స్థితిలో అతను ఫోన్ చేసినట్టు పోలీసులు తెలిపారు.పీసీఆర్ కాల్ అందగానే ఒక టీమ్ను రంగంలోకి దింపామని, కాలర్ను కరోల్ బాగ్కు చెదిన 48 ఏళ్ల హేమంత్ కుమార్గా గుర్తించి పోలీస్ స్టేషన్కు తీసుకువచ్చి విచారణ జరుపుతున్నామని పోలీసులు తెలిపారు. ఆ వ్యక్తి గత ఆరేళ్లుగా నిరుద్యోగిగా ఉన్నాడని, తాగుడు అలవాటు ఉందని చెప్పారు. కాగా, మరిన్ని విషయాలు తెలియాల్సి ఉన్నాయి.

## మహిళల సేవలు అభినందనీయం

**కాకినాడ**



సమాజానికి నిరంతరం పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న కోరమండల్ మహిళా క్లబ్ సేవలు అభినందనీయమని కోరమండల్ ఫెర్టిలైజర్స్ ముఖ్య అధికారి సిహెచ్. శ్రీనివాసరావు పేర్కొన్నారు. రమణయ్యపేట కూరగాయల మార్కెట్ వద్ద కోరమండల్ మహిళా క్లబ్ నిర్వహిస్తున్న మజ్జిగ చలివేంద్ర కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించి బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 36 రోజులుగా మిట్ట మధ్యాహ్నం బాటసారుల దాహార్తిని తీర్చడానికి కోరమండల్ మహిళా క్లబ్ సభ్యులు మజ్జిగను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఆర్తులకు, దీనులకు మేమున్నామంటూ పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న తమ సంస్థకు చెందిన మహిళలు ముందంజలో ఉండడం హర్షనీయమని శ్రీనివాసరావు తెలిపారు. మహిళా క్లబ్ అధ్యక్షురాలయిన సిహెచ్. వెంకట దుర్గావతి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మల్లీశ్వరి, శ్రీదేవి, మోహిని, సృజన, విజయలక్ష్మి, అంజుమ్ తదితర మహిళా సభ్యులు పాల్గొన్నారు.

## అడ్మిషన్ల పేర్లతో ఇబ్బంది పెట్టే స్కూల్స్ లైసెన్స్ వెంటనే రద్దు చేయాలి

**హైదరాబాద్ :**
అడ్మిషన్ల పేర్లతో తల్లితండ్రులను ఇబ్బంది పెట్టే స్కూల్స్ కి వెంటనే లైసెన్స్ రద్దు చేయాలని బిసి మహిళా నాయకురాలు మట్ట జయంతి డిమాండ్ చేసారు. తల్లిదండ్రుల కష్టపడి లక్షల రూపాయలు అప్పులు తెచ్చి మరి పిల్లల్ని చదివిస్తూ ఉంటే అధికంగా ఫీజు రూపంలో వసూలు చేస్తున్నటువంటి స్కూల్స్ కి మరియు కాలేజీలకు నోటీసు ఇవ్వాలని,ఐనా వారు వినని పక్షంలో వాళ్ల లైసెన్స్ రద్దు చేయాలన్నారు. పిల్లలు ప్రైవేట్ స్కూల్లో చదవాలి అనే ఉద్దేశంతో ఉన్న తల్లిదండ్రులు వడ్డీలకి డబ్బులు తెచ్చి మరీ చదివిస్తున్నారు కానీ అడ్మిషన్ల పేరిట లక్షలు వసూలు చేస్తున్నప్పటికీ కూడా వాళ్ళ ఆకలి తీరడం లేదు పిల్లల్ని ఇబ్బంది వాళ్లకి పనిష్మెంట్ ఇవ్వడం లాంటివి చేస్తూ ఉన్నారని ప్రశ్నించారు. పిల్లలకి ఇబ్బంది కలగకుండా కొత్త జీవో రావాలని, ఫీజులకు సంబంధించి తల్లిదండ్రులతో మాత్రమే మాట్లాడాలి చిన్న వయసులో పిల్లల్ని ఫీజుల గురించి ఇబ్బంది పెట్టి వాళ్ళ మనోభావాలు దెబ్బతీస్తే స్కూల్స్ గాని కాలేజ్ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జయంతి డిమాండ్ చేసారు. చాలావరకు విద్యార్థులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి కూడా రాకపోవచ్చు ఈ మధ్యన చాలామంది ఫీజులు కట్టలేని పరిస్థితిలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థులను చాలా మందిని చూసాం అలాంటి పరిస్థితి రాకుండా చూసుకోవాల్సిన పరిస్థితి రాష్ట్ర ప్రభుత్వానిది విద్యాశాఖ మంత్రి ఈ విషయంలో పూర్తి చర్యలు తీసుకోవాలని కోరారు

## విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడిని అరికట్టాలి

**రామడుగు**
రాష్ట్రంలో ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల్లో కళాశాలలో ఫీజుల పేరుతో జరుగుతున్న దోపిడీని అరికట్టాలని రాష్ట్ర ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టం తేవాలని అఖిల భారత విద్యార్థి సమైక్య (ఏఐఎస్ఎఫ్)జిల్లా ప్రధాన కార్యదర్శి మచ్చ రమేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు రాష్ట్రంలో ఫీజుల నియంత్రణ చట్టం లేకపోవడం దానార్జనే ధ్యేయంగా ప్రభుత్వ నిబంధనలు పక్కనపెట్టి ఇష్టానుసారంగా లక్షలాది రూపాయలు ఫీజుల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల నుండి నిలువు దోపిడీ చేస్తున్న సంబంధిత అధికారులు వారు ఇచ్చే ముడుపులకు ఆశపడి చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నారని మచ్చ రమేష్ ఆరోపించారు. అన్ని వర్గాల విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందాలంటే వారు ఉన్నత చదువులు చదువుకోవాలన్న అందరికీ విద్య సమానంగా అందించాలనే సామాజిక బాధ్యతతో రాష్ట్ర ప్రభుత్వం ఫీజుల పైన విద్యారంగం పట్ల అనుభవం ఉన్న వ్యక్తులను మేధావులను విద్యార్థి సంఘాలను పిలిచి వారి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని రాష్ట్ర ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.

# ఇవాళ్టి నుంచే మహానాడు...భారీ ఏర్పాట్లు చేసిన టీడీపీ

**రాజమండ్రి:**

మహానాడు వేదికగా ఘనంగా ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలు జరుపుతామని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు తెలిపారు. చంద్రబాబు డిజిటల్ సంతకం ద్వారా ప్రతినిధుల సభకు ఆహ్వానాలు అందిస్తామని పేర్కొన్నారు. తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన ఎన్టీఆర్, రాష్ట్ర, దేశ రాజకీయాల్లో అద్భుతమైన మార్పులు తెచ్చారని గుర్తు చేశారు. రాజమండ్రిలోని వేమగిరిలో నిర్వహించే మహానాడులో అన్ని అంశాలపై చర్చలు జరుపుతామ్మనారు. రాజకీయ, సాంఘీక, ఆర్థిక, ఆరోగ్య, సంస్థాగత అంశాలపై చర్చిద్దామని తెలిపారు. గే ప్రభుత్వ ప్రజా వ్యతిరేక, అప్రజాస్వామిక విధానాలపై చర్చిస్తామని చంద్రబాబు వెల్లడించారు. మే 28వ తేదీన భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు తెలిపారు. టీడీపీ ప్రతిష్మాత్మకంగా నిర్వహిస్తున్న మహానాడు కార్యక్రమానికి తూర్పు గోదావరి జిల్లా రామమహేంద్రవరం అంగరంగ వైభవంగా ముస్తాబవుతోంది. వేమగిరి, ధవళేశ్వరం పరిధిలోని మహానాడు ప్రతినిధుల సభ ఇప్పటికే సిద్ధమైంది. ఇక్కడ ఏసీ హాల్ ను కూడా సిద్ధం చేశారన్నారు. బహిరంగ సభ ఏర్పాట్లు దాదాపు పూర్తి కావొస్తున్నాయన్నారు. పసుపు తోరణాలతో రాజమహేంద్రవరం వీధులను పసుపుమయం చేస్తున్నారు. పలువురు నేతలు ఇప్పటికే ఇక్కడ బస చేశారన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కె. అచ్చెన్నాయుడు, మాజీ డిప్యూటీ సీఎం నిమ్మకాయల చినరాజప్ప, పొలిట్ బ్యూరో సభ్యుడు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, రామకృష్ణారెడ్డి, గన్నికృష్ణ, ఆదిరెడ్డి వాసు, అనగాని సత్యప్రసాద్, తదితరులు ఏర్పాట్లను ప్రయవేక్షిస్తున్నారు. గోదావరి జిల్లాలన్నీ పసుపుమయం కావాలని, ప్రతి ఇంటి నుంచి జనం తరలి రావాలని ఇచ్చిన పిలుపు నేపథ్యంలో ఎవరికి వారు పసుపు తోరణాలు, ఫ్లెక్సీలు, జెండాలు ఏర్పాటు చేస్తున్నారు. రాజమహేంద్రవరం రూరల్ లోని పిడింగొయ్య జైహింద్ నగర్ లో తెలుగు మహిళలు బుధవారం రోజు ఇంటింటికీ తిరిగి బొట్టు పెట్టి మరీ మహానాడుకు ఆహ్వానించారు. తెలుగు వాళ్ల పండగకు ఇంటిల్లిపాదితరలి రావాలని రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి మజ్జి పద్మావతి, కొయ్యన కుమారి తదితరులు కోరారు. టీడీపీ అధినేత చంద్రబాబు మంజీరా ఇంటర్నేషనల్ హోటల్ లో ఆయన దిగుతారు. అదే రోజు సాయంత్రం 5 గంటలకు టీడీపీ పొలిట్ బ్యూరో సమావేశం నిర్వహిస్తారు. మహానాడులో ప్రవేశ పెట్టే తీర్మానాల మీద, ఏర్పాట్ల మీద చర్చిస్తారు. ఆయన మూడ్రోజుల అక్కడే ఉంటారు. మహానాడు తొలి రోజు ప్రతినిధుల సభలో 15 తీర్మానాలపై చర్చ జరగనుంది. 15 వేల మంది ప్రతినిధులు పాల్గొనేందుకు పెద్ద వేదికను ఏర్పాటు చేశారు. వేదిక మీద చంద్రబాబుతో పాటు పొలిట్ బ్యూరో సభ్యులు, పార్టీ ముఖ్య నేతల, 175 అసెంబ్లీ నియోజక వర్గాల ఇంఛార్జీలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, పార్లమెంటరీ ఇంఛార్జీలు ఆశీనులు అవుతారు. వేదిక మీద సుమారు 300 మంది వరకు ఉండే అవకాశం ఉంది. ఒక్కో తీర్మానంపై కనీసం ఇద్దరు చొప్పున 50 మంది వరకూ మాట్లాడే అవకాశం ఉంది. హైదరాబాద్‌లోని హస్తం పార్టీ ముఖ్యమంత్రులు.... ఢిల్లీ అధిష్టానానికి తెలిపి... వారి నిర్ణయం వచ్చే వరకు చేతులు కట్టుకొని చేష్టలుడిగి... ఆధిష్టానం నిర్ణయం కోసం వెయిటింగ్ చేయడం.. అలాగే ఢిల్లీ నుంచి వచ్చిన ఆధిష్టానం దూతలు.. సీల్డ్ కవర్ ముఖ్యమంత్రుల పేర్లు ప్రకటించడం.. అదే విధంగా అంతర్గత ప్రజాస్వామ్యానికి కేరాఫ్ అడ్రస్ అయిన కాంగ్రెస్ పార్టీ నేతల్లో రేగిన అసమ్మతి రాగాన్ని సవరించేందుకు ఢిల్లీ నుంచి భాగ్యనగరానికి చేరిన దూతలు... కూల్ కూల్ అంటూ అసమ్మతి నేతలను కూల్ చేయడం వంటి వగై రాజకీయాలకు హోల్‌సేల్‌గా చెక్ పెట్టిన ఒకే ఒక్కడు.. మూడుక్షరాల మహాశక్తి ఎన్టీఆర్. ఆ యుగ పురుషుడు ప్లస్ శక పురుషుడి జయంతిని పురస్కరించుకుని తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం వేదికగా.. మే 27వ తేదీన పసుపు పార్టీ పండుగ.. మహా పండగ.. మహానాడు ప్రారంభం కానుంది. మరోవైపు ఆ కథానాయకుడు ప్లస్ మహానాయకుడు శత జయంతి వేడుకలు రాజమహేంద్రవరంలో జరిగే మహానాడు వేదికగా ముగియనున్నాయి. ఆ క్రమంలో ఈ మహానాడుకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న అన్నగారి ఆత్మబంధువులు.. లక్షలాదిగా తరలిరానున్నారు. అందుకోసం ఏర్పాట్లు వాయువేగంతో జరుగుతున్నాయి. ఇంకోవైపు.. ఈ ఏడాది చివర లేకుంటే.. వచ్చే ఏడాది మొదట్లో ఎన్నికలు జరగనున్నాయనే ఓ ప్రచారం జోరుగా సాగుతున్న వేళ సైకిల్ పార్టీ నిర్వహిస్తున్న మహానాడుపై అటు అన్ని వర్గాల ప్రజలే కాదు.. ఇటు వివిధ రాజకీయ పార్టీలు, నేతలల్లో సైతం ఆసక్తి నెలకొంది. ఈ వేడుక వేదికగా ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు కీలక ప్రకటన చేయనున్నారని.. అందులోభాగంగా అన్న గారు స్థాపించి పార్టీ అధికారంలోకి వస్తే.. ప్రజల కోసం చేపట్టే సంక్షేమ పథకాలను ఈ వేదికపై నుంచి ప్రకటించే అవకాశం ఉందని తెలుస్తోంది. అలాగే జగన్ గద్దెనెక్కిన తర్వాత.. అంటే ఈ నాలుగేళ్లలో రాష్ట్రంలో చోటు చేసుకున్న పరిణామాలపై పార్టీ అధినేతతో పాటు ఆ పార్టీ కీలక నేతలు సైతం విమర్శనాస్త్రాలు సంధించేందుకు తమ మాటలకు పదును పెడుతోన్నట్లు సమాచారం.

# ఏపీలో ఎడతెగని పంచాయితీలు

**విజయవాడ :**

వచ్చే ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసినా, లేదా జనసేనతో కలిసి పోటీ చేసినా గెలుస్తామనే గ్యారెంటీ వచ్చేసినట్లుంది. పైగా బీజేపీపై ఏపీ జనంలో వ్యతిరేకత ఉందని పసిగట్టి టీడీపీ వ్యూహం మార్చేసింది. కానీ, దీర్ఘకాలిక వ్యూహాల్లో భాగంగా టీడీపీకి దూరంగా ఉండాలని బీజేపీ కేంద్ర నాయకత్వం నిర్ణయించుకుంది. దీంతో బీజేపీతో ఇక లాభం లేదనుకున్న చంద్రబాబు వ్యూహం మార్చినట్లు కనిపిస్తోంది. చంద్రబాబు అంచనా ప్రకారం ఏపీలో టీడీపీ, బీజేపీ, జనసేన కలిసి పోటీ చేస్తే ఈ కూటమి అధికారంలోకి రావడం పక్కా. టీడీపీతో కలిసేందుకు జనసేన సిద్ధంగానే ఉంది. మరోవైపు ఇప్పటికే జనసేన-బీజేపీ కూటమిగా ఉన్నాయి. కానీ, టీడీపీతో కలిసేందుకు బీజేపీ సిద్ధంగా లేదు. పైగా జనసేనను కూడా దూరంగా ఉంచేందుకు ప్రయత్నిస్తోంది. దీని ద్వారా అంతిమంగా లబ్ధి పొందేది వైసీపీ. ఆ పార్టీని అధికారంలోకి తేవడానికి ఇదంతా బీజేపీ అమలు చేస్తున్న వ్యూహం. ఢిల్లీ కేంద్రంగా కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. పవన్ కల్యాణ్ వ్యూహాత్మకంగా బీజేపీతో కలిసి ఎన్నికల్లో పోటీ చేయాలనే నిర్ణయానికి వచ్చారు. పవన్ నేరుగా బీజేపీ ముఖ్యులతో ఇదే ప్రతిపాదన పైన చర్చలు చేసారు. ఇప్పుడు కర్ణాటక ఎన్నికల ఫలితాలు వ్యతిరేకంగా రావటంతో పవన్ ప్రతిపాదన పైన బీజేపీ సానుకూలంగా స్పందిస్తుందనే అంచనాలు పెరిగాయి. ఏ నిర్ణయం తీసుకోబోతున్నారనేది అస్పష్టంగానే ఉంది. పొత్తుల వ్యవహారం పైన బీజేపీ నుంచి ఇప్పటి వరకు స్పష్టత లేదు కానీ, తాము కోరుకున్న దానికి భిన్నంగా కేంద్రం నుంచి సీఎం జగన్‌కు మద్దతు కనిపిస్తోంది. ఏపీలో వైసీపీ ప్రభుత్వంపై బీజేపీ వ్యతిరేకతతో ఉన్నట్లు కనిపిస్తున్నా.. లోపాయికారిగా ఆ పార్టీకి బీజేపీ సహకరిస్తోంది. ఇది నిజమే అనిపించకమానదు. కొన్ని అంశాల్ని పరిశీలిస్తే. అధికారికంగా రెండు పార్టీల మధ్య ఎలాంటి పొత్తూ లేదు. కానీ, కేంద్రంలో బీజేపీకి ఎలాంటి మద్దతు అవసరమైనా సరే వైసీపీ ముందుంటుంది. దేశంలో ఎన్ని పార్టీలు బీజేపీపై ఎన్ని విమర్శలు చేస్తున్నా వైసీపీ మాత్రం మోదీని కానీ.. బీజేపీని కానీ ఒక్క మాట కూడా అనలేదు. పోనీ ఇంత మద్దతు ఇస్తున్నప్పటికీ ఏపీకి బీజేపీ ఏమైనా ఒరగబెట్టిందా అంటే అదీ లేదు. బీజేపీ రాష్ట్రానికి ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వదు. ఏపీకి గర్వకారణమైన విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటు పరం చేస్తోంది. అయినా వైసీపీ మౌనంగానే ఉంటుంది. ఏపీకి ఏ ప్రయోజనం కలగకపోయినా వైసీపీ నేతలు అడగరు. 25 మంది ఎంపీలను ఇస్తే అవన్నీ ఎందుకు రావు అంటూ చెప్పుకొచ్చాడు. తీరా జగన్ అధికారంలోకి రాగానే వాటి ఊసే మర్చిపోయాడు. కేంద్రాన్ని ఈ విషయంలో ప్రశ్నించకపోగా పూర్తిగా సపోర్ట్ చేస్తున్నాడు జగన్. దీంతో ఇరుపార్టీల మధ్య రహస్య ఒప్పందం ఉందనే ప్రచారం ఊపందుకుంది. జగన్ ఇక్కడే తన రాజకీయ చతురత ప్రయోగించాడు. ప్రత్యేక హోదా రానందుకు చంద్రబాబును విమర్శించాడే తప్ప బీజేపీని జగన్ ఏమీ అనలేదు. తప్పనిసరి పరిస్థితుల్లో చంద్రబాబు బీజేపీపై తిరుగుబాటు చేసి ఆ పార్టీకి దూరమయ్యారు. దీంతో మోదీతో, బీజేపీతో చంద్రబాబుకు ఉన్న బంధం తెగిపోయింది. దీనిలో నష్టపోయింది చంద్రబాబు. లబ్ధి పొందింది జగన్. ఎన్నికలకు సిద్ధం అవుతున్న వేళ సీఎం జగన్ ఆర్థిక కష్టాలతో పథకాల అమలు కష్టంగా మారుతుందని ప్రతిపక్షాలు అంచనా వేసాయి. ఉద్యోగుల బకాయిలు..కాంట్రాక్టర్లకు విడుదల చేయాల్సిన పెండింగ్ బిల్లులు.. నిర్వహణ ఖర్చుల భారం సమస్యగా మారుతుందని లెక్కలు వేసారు. ఇదే సమయంలో ప్రభుత్వం పైన రాజకీయంగా దాడిని పెంచారు. ముఖ్యమంత్రి జగన్‌కు పాలనా పరంగా ఆర్ధిక నిర్వహణ ప్రధాన సమస్యగా మారుతోంది. ఎన్నికల ఏడాది కావటంలో సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే పెండింగ్ హామీలు..బిల్లుల విడుదల చేయాల్సి ఉంది . ఏపీకి రావాల్సిన రెవెన్యూ లోటు నిధుల కోసం ఎంతగా ప్రయత్నించినా ఆమోదం చెప్పని కేంద్రం.. ఇప్పుడు విడుదలకు ఆదేశాలు ఇచ్చింది. ఎన్నికల సమయంలో జగన్ సర్కార్‌కు ఈ మధ్య కేంద్రం భారీ రుణాలు ఇస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 32 వేల కోట్లకు పైగా రుణాలకు ఏపీకి కేంద్రం ఇప్పటికే అనుమతిచ్చింది. ఏపీలో ఉన్న ఆర్థిక కష్టాల నేపథ్యంలో కేంద్రం ఇస్తోన్నఈ రుణం నిర్ణయం భారీ ఉపశమనంగా మారనుంది. నిజానికి భారతీయ జనతాపార్టీకి ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం 0.5శాతం ఓట్లు కూడా లేవు. దీంతో ఏపీకి ఆర్థికంగా అండగా ఉంటూ లోపాయికారీ ఒప్పందం ద్వారా భారతీయ జనతా పార్టీ 5-6 పార్లమెంట్ స్థానాలని దక్కించుకోవాలన్నది వ్యూహం. అయితే ఈ కొత్త పొత్తుల వార్తల నేపథ్యంలో చంద్రబాబు-పవన్ తమ పార్టీలతోనే పొత్తు ప్రకటిస్తాయా అనేది తేలాల్సి ఉందిఇక సీఎం జగన్ విషయానికి వస్తే... ఉద్యోగుల సమస్యలు పరిష్కరించి, పార్టీలో ఉన్న సంస్థాగత లోపాలు సరిదిద్ది, అసమ్మతిని చల్లార్చాల్సి ఉంది. కొన్ని స్థానాల్లో అభ్యర్థులను మార్చి చౌకబారు విమర్శలు చేస్తున్న పార్టీ నాయకులను మంత్రులను అదుపు చేసి పార్టీపై నియంత్రణ సాధించి, క్షేత్ర స్థాయి పరిస్థితులను కార్యకర్తలతో సమీక్షించి. పార్టీ పరంగా కఠిన నిర్ణయాలు తీసుకోవాలి. అభివృద్ధి, సంక్షేమం గురించి అధికారులతో చర్చించి వారిని భాగస్వాములను చేసి లోపాలు సరిదిద్దాలి.

## గడపగడపలోనూ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు

**ఆముదాలవలస**

రాష్ట్రం లో ముఖ్యమంత్రిగా వైయస్ ఎస్ జగన్మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుండి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి తమ్మి సీతారాం పేర్కొన్నారు. సరుబుజ్జిలి మండలం మతలబుపేట గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన వారికి నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేసి ఆర్థిక భరోసా కల్పిస్తున్నారన్నారు. నిరుపేదల గౌరవాన్ని పెంచేలా జగన్ ప్రభుత్వనీ అడుగులు వేస్తుందన్నారు. ఈ సందర్భంగా అందులో ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాల లబ్ధి ఏ మేరకు చేకూరురుతుందో ప్రజలను అడిగి తెలుసుకున్నారు. జగన్మోహన్ రెడ్డి ఆలోచన, ఆశయానికి ప్రతిరూపంగా ఉన్న గడపగడపకు మన ప్రభుత్వ లక్ష్యం ఉద్దేశాన్ని ఆయన ప్రజలకు వివరించారు. నాడు వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రజాసంకల్పయాత్ర లో ప్రజా సమస్యలను ప్రత్యక్షంగా చూశారన్నారు. నేను విన్నాను.. నేను ఉన్నాను ఉంటూ ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామంటూ భరోసా కల్పించారన్నారు .ఇచ్చిన హామీలను నెరవేర్చామని చెబుతూ మిగిలిన ప్రజాసమస్యల పరిష్కారమే ప్రథమ కర్తవ్యం అన్నారు. సాంకేతిక పరమైన సంక్షేమ పథకాలు అందకపోతే, గ్రామ సచివాలయం ద్వారా దరఖాస్తులు సమర్పించాలని ఆయన సూచించారు. ప్రతి గ్రామంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం ప్రజానీకం ముందు ఉంచేందుకు ఇది ఒక చక్కటి కార్యక్రమం అని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అందిస్తున్న ప్రభుత్వ పథకాల లబ్ధిని, కలిగే ప్రయోజనాలను ప్రతి గడపకు వివరిస్తుంటే ప్రజల ముఖాన ఆనందం కనిపిస్తుంది అని గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రాష్ట్రంలో ప్రతి నియోజవర్గం లో విజయవంతం అయిందని అన్నారు. ఇంతటి మంచి కార్యక్రమం ద్వారా ప్రజల్లోకి వెళ్లడం ఒక శుభ పరిణామంగా ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కె వి జి సత్యనారాయణ, జెడ్పీటీసీ సురవరపు నాగేశ్వరావు, మండల పార్టీ అధ్యక్షులు మార్కెట్ కమిటీ చైర్మన్ బెవర మల్లేశ్వరరావు, పి ఎ సి ఎస్ అధ్యక్షులు కోవిలాపు చంద్రశేఖర్, స్థానిక ఎ సర్పంచ్ కృష్ణ తదితర వైఎస్ఆర్ పార్టీ నాయకులు కార్యకర్తలు సర్పంచులు ఎంపీటీసీలు మరియు ఎంపీడీవో, ఎంఈఓ, ఏపీవో, అగ్రికల్చర్ ఏవో, సచివాలయ సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.

## ఆదివాసీలపై వైమానిక బాంబు దాడులు నిలిపివేయాలి

**సంగారెడ్డి :**

మావోయిస్టుల ఏరివేత పేరుతో ఆదివాసీలపై వైమానిక బాంబు దాడులు నిలిపివేయాలని సిపిఐ ఎంఎల్ పార్టీ కార్యదర్శి మల్లేపల్లి ప్రభాకర్ డిమాండ్ చేసారు. ఆదివాసులపై జరుగుతున్న వైమానిక దాడులు అమానుషమని ప్రభాకర్ తీవ్రంగా మండిపడ్డారు. 27 న హైదరాబాద్ లో జరిగే రేపు 55వ వసంత విప్లవ మెగా గర్జన నక్సల్ బరి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు. దండకారుణ్యం శత్రు దేశమా? దండకారణ్యం ఆదివాసీలపై వైమానికదాడులు ఎందుకు చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు మోడీ ప్రభుత్వం బడా పెట్టుబడి వర్గం విదేశీ కార్పొరేట్ కంపెనీల అడవి దోపిడీ కోసం అవకాశం ఇవ్వటం ప్రారంభించిన అన్నారు. మానవ సంబంధాల్లో సంక్షేమంతో పాటు నిర్బంధం పెరిగి పోతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా విధానంలో మార్పులు తీసుకొచ్చారని, సిబిఎస్సి సిలబస్ లో ప్రజాస్వామ్యం అనే పదం తీసివేయడం దుర్మార్గమైన చర్యఅని అన్నారు. దీనిని అమానుషంగా పాలకులు అమలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు రాజ్యాంగం వారికి అడ్డు వస్తుందనే ఉద్దేశం తో కాషాయ కూటమి కుట్ర చేస్తుందని అని విమర్శించారు. దేశం భవిష్యత్తును ప్రజాస్వామ్యాన్ని అందరూ కాపాడుకోవాల్సిన బాధ్యతగా ఉందని ప్రభాకర్ పేర్కొన్నారు.

## పాతబస్తీలో దారుణం చోటుచేసుకుంది

**హైదరాబాద్**

కంచన్ బాగ్ పోలీస్ స్టేషన్ పరిధిలో డిఆర్డీవో సమీపంలో వీధి కుక్కలు స్వైరవిహారం చేసి మూడు ఏళ్ల బాలుడి పై విచక్షణ రహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపరచడం జరిగింది. వివరాల్లోకి వెళితే..వికాస్ కుమార్ డీఆర్డీవో టౌన్ షిప్ సి టైప్ క్వార్టర్ లో ఉంటున్నాడు. అతని కుమారుడు అతర్వ వర్మ మూడు సంవత్సరాల బాలుడు గురువారం రాత్రి సమయంలో ఇంటికి వెళుతుండగా 5 వీధికుక్కలు కుక్కలు ఒకే సారి కలిసి బాలుడి పై దాడి చేసి కరవడం జరిగింది. బాలుడి తండ్రి జీహెచ్ఎంసి కి ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినాన కానీ.. రాత్రి పూట మేము ఏమీ చేయలేమని చేతులెత్తేశారు.

## శ్రీ గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాలకు వైభవంగా ధ్వజారోహణం

**తిరుపతి**

తిరుపతి శ్రీ గోవిందరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఉదయం 8.22 నుండి 8.49 గంటల మధ్య మిథున లగ్నంలో వైభవంగా ప్రారంభమయ్యాయి. వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాలు, భక్తుల గోవిందనామస్మరణ నడుమ గరుడ చిత్రంతో కూడిన ధ్వజపటాన్ని ధ్వజస్తంభంపై ప్రతిష్ఠించారు. అనంతరం శ్రీవారి ఆస్థానం ఘనంగా జరిగింది. అంతకుముందు శ్రీగోవిందరాజస్వామివారు, ధ్వజపటం, చక్రత్తాళ్వార్, పరివార దేవతలు బంగారు తిరుచ్చిపై నాలుగు మాడ వీధుల్లో విహరించారు. ఈ ఊరేగింపు ద్వారా బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను స్వామివారు ముందుగా పర్యవేక్షిస్తారని ప్రతీతి. అనంతరం అర్చకులు విష్వక్సేన ఆరాధన, వాస్తుహోమం, గరుడ లింగహోమం, గరుడ ప్రతిష్ట , రక్షా బంధనం చేపట్టారు. మిథున లగ్నంలో శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామివారి సమక్షంలో ధ్వజారోహణం నిర్వహించారు. 18 గణాలను, ముక్కోటి దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించడం ధ్వజారోహణం ఉద్దేశం

## నేషనల్ హైవే కి భూమి పూజ

**నంద్యాల**

నంద్యాల జిల్లా హనుమంతరాయుని కొట్టాలలో 53కి.మీ నేషనల్ హైవే-340బీకి ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ శుక్రవారం భూమి పూజ చేసారు. రూ.630 కోట్ల అంచనాతో ఓర్వకల్ మండలం సోమయాజుల పల్లె నుంచి డోన్ వరకూ జాతీయ రహదారి నిర్మాణం జరగనుంది. భూమి పూజకు ముందు హెచ్. కొట్టాల రోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజ నిర్వహించారు.
నంద్యాల జిల్లా కలెక్టర్ మనజీర్ జీలానీ సమూన్, బేతంచెర్ల మున్సిపల్ చైర్మన్ చలం రెడ్డి,ఎంపీపీ నాగభూషణం, జెడ్పీటీసీ శివలక్ష్మమ్మ, ఎంపీటీసీ రత్నమ్మ, హెచ్.కొట్టాల సర్పంచ్ వెంకట లక్ష్మమ్మ తదితరులు హజరయ్యారు.

## వాగ్దానాలతో ప్రజలు మోసపోయారు

**కొత్తపేట**

జగన్ చెప్పిన మాటలను ఇచ్చిన వాగ్దా నాలను నమ్మి ప్రజలు మోసపోయారని రాష్ట్ర టిడిపి అధ్యక్షులు అచ్చం నాయుడు అన్నారు. ఎన్టీఆర్ శతజయంతి ఉత్స వాల్లో భాగంగా కోనసీమ జిల్లాలో కొత్తపేట మండలం వాడపాలెం గ్రామంలో నందమూరి తారక రామారావు విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్ర టిడి పి ఉపాధ్యక్షులు కొత్తపేట నియోజకవ ర్గ టిడిపి ఇంచార్జ్ బండారు సత్యానం దరావు ఆధ్వర్యంలో ఆయన అధ్యక్ష తన సమావేశం జరిగింది. సమావేశం లో కింజవరపు అచ్చం నాయుడు మాట్లాడుతూ నేర చరిత్ర కలిగినటువం టి జగన్ ను ప్రజలు ఎలా నమ్మా రని ఆయన ప్రశ్నించారు. 11 కేసుల్లో ముద్దాయిగా ఉండి 16 నెలలు జైలు శిక్ష అను భవించి వచ్చిన వ్యక్తి కల్లబొల్లి మాటల తో ప్రజలను తప్పుదోవ పట్టించారని ఆయన విమర్శించారు. ఆశతో ప్రజలు నమ్మి ఓటు వేయటం వలన ఈ రాష్ట్రా నికి తీరని అన్యాయం జరిగినదని ఆయన అన్నారు. 2014, 2019 రాష్ట్రా నికి స్వర్ణయుగం లాంటిదని అభివృ ద్ధి ,సంక్షేమం ఫలాలు ప్రజలకు అందా యని ఆయన అన్నారు. చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రి చేసుకోవ టం ఈ రాష్ట్రానికి చారిత్రాత్మక అవస రం అని ఆయన అన్నారు.

## జూన్ 22 నుండి ఆషాడ బోనాలు

**హైదరాబాద్**

వచ్చే నెల 22 నుంచి నగరంలో ఆషాడ బోనాలు ప్రారంభం అవుతున్నాయి. ఈ మేరకు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అధ్యక్షతన నేడు బేగంపేట లోని హరిత ప్లాజా లో ఏర్పాట్లపై ఉన్నతస్థాయి సమావేశం అయింది. జూన్ 22 న గోల్కొండ లో ఆషాడ బోనాలు ప్రారంభం అవుతాయి. జులై 9 న సికింద్రాబాద్ మహంకాళి బోనాలు, 10 రంగం, 16 న ఓల్డ్ సిటీ బోనాలు, 17 న ఉమ్మడి దేవాలయాల ఆధ్వర్యంలో ఊరేగింపు జరుగుతాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో సంస్కృతిని చాటి చెప్పే విధంగా బోనాల ఉత్సవాలు జరుగుతున్నాయని మంత్రి అన్నారు.

## అమరావతిపై కక్షతోనే సీఎం జగన్ సెంటు పట్టాల నాటకం: బోండా ఉమ

**అమరావతి :**



రాజధాని అమరావతిలో ప్రభుత్వం సెంటు భూమి పంచడంపై టీడీపీ నేత బోండా ఉమ ధ్వజమెత్తారు. అమరావతిపై కక్షతోనే సీఎం జగన్ సెంటు పట్టాల నాటకం ఆడుతున్నారని మండిపడ్డారు. సెంటు పట్టాలు అనేవి ఒక బోగస్‌గా కొట్టిపారేశారు. కనీస వసతులుగా రోడ్లు, కరెంట్ ఏమీ లేకుండానే సెంటు పట్టాలు పేదలకు ఇస్తే ఏమీ చేసుకుంటారని ప్రశ్నించారు. అయినా సుప్రీం కోర్టు సెంటు పట్టాకు చట్టబద్ధత లేదని చెప్పినా జగన్ పేదలను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతిలో జరిగే ముఖ్యమంత్రి సభకు ప్రజలను బలవంతంగా తరలిస్తున్నారని ఆరోపించారు.

# వెల్లంపల్లికి ఇంటికి సెగ

**విజయవాడ,:**

ప్రతిపక్ష పార్టీలపై విరుచుకుపడటంలో ఆయనకు మరెవరూ సాటి రారు. అటు అసెంబ్లీలోనూ ఇటు బయట ఛాన్స్ దొరికితే చాలు విపక్షాలపై యుద్ధానికి దిగుతారు. తనదైన శైలిలో మాటల తూటాలతో విరుచుకుపడుతుంటారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ల పేరు వినబడితే చాలు ఒంటికాలిపై లేచేస్తారు. మంత్రిగా ఉన్నా, మాజీమంత్రిగా ఉన్నా ఆయన రీతిలో ఎలాంటి మార్పు రాలేదు. విమర్శల దాడిలో సెగ కూడా ఏమీ తగ్గలేదు. విపక్ష నేతలపై ఎలా అయితే విరుచుకుపడతారో అంతేస్థాయిలో అధికార పార్టీ నేతలపైనా విరుచుకుపడతారు. నువ్వేమైనా తోపువా అంటూ ఘాటు విమర్శలు చేస్తారు. ఇంతకీ ఆ మాజీమంత్రి ఎవరో తెలిసే ఉంటుంది కదూ ఇంకెవరు వెల్లంపల్లి శ్రీనివాసరావు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఫైర్ బ్రాండ్‌లలో వెల్లంపల్లి ఒకరు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పైనా..వైసీపీ పైనా ఎవరైనా విమర్శలు చేస్తే చాలు ఇక ఆగమేఘాల మీద మీడియా ఎదుట వాలిపోతారు. విమర్శలు చేసిన వారికి గట్టిగా కౌంటర్ ఇచ్చేవరకు నిద్రపోరు అనడంలో ఎలాంటి సందేహం లేదు. అలాంటి వెల్లంపల్లి శ్రీనివాసరావుకు నియోజకవర్గంలో ఎదురీత ఎదురవుతున్నట్లు తెలుస్తోంది. అనేక సర్వేలు వెల్లంపల్లి శ్రీనివాసరావుకు అనుకూలంగా లేవని తెలుస్తోంది. అంతేకాదు నియోజకవర్గానికి చెందిన మైనారిటీలు సైతం వెల్లంపల్లి శ్రీనివాసరావుపై ఆగ్రహంగా ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో ఆయన ప్రస్తుతం నియోజకవర్గంలో అసమ్మతిపోరుతో సతమతమవుతున్నట్లు తెలుస్తోంది.వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి కృష్ణా జిల్లాలో ఉన్న బలమైన నాయకులలో మాజీమంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావు ఒకరు. అంతేకాదు విపక్షాలపై విరుచుకుపడే నేతలలో....వైసీపీ వాయిస్‌ను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లే నేతలలో వెల్లంపల్లి శ్రీనివాసరావు ముందు వరుసలో ఉంటారనడంలో ఎలాంటి సందేహం లేదు. అటు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఇటు జనసేనాని పవన్ కల్యాణ్‌లపై విరుచుకుపడే నాయకులలో టాప్ టెన్‌లో వెల్లంపల్లి చోటు దక్కించుకుంటారనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ క్వాలిఫికేషన్సే జగన్ ఫస్ట్ కేబినెట్‌లోనే చోటు దక్కించుకోవడానికి కారణమైంది అనడంలో ఎలాంటి అనుమానమే అక్కర్లేదు. మూడేళ్లు మంత్రిగా ఉన్నప్పుడు ఓ వెలుగు వెలుగొందారు. మాజీమంత్రి అయిన తర్వాత కాస్త ఇమేజ్ తగ్గినప్పటికీ తమ విమర్శలలో వేడి మాత్రం తగ్గలేదు. అయితే నియోజకవర్గంలో ఆయనకు అసమ్మతి వర్గం తయారైనట్లు తెలుస్తోంది. నాడు ఓట్లేసి గెలిపించిన వాళ్ళే టికెట్ ఇవ్వొద్దంటూ నివేదికలు పంపుతున్నట్లు ప్రచారం జరుగుతుంది. అటు ఐప్యాక్ టీమ్ సైతం నెగిటివ్‌గా ఫీడ్ బ్యాక్ ఇచ్చినట్లు తెలుస్తోంది.విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో గెలుపు ఓటములను డిసైడ్ చేసేది ముస్లింమైనారిటీలే. రెండు లక్షల 20వేల ఓటర్లు ఉంటే వారిలో 60 వేలకు పైగా ఓట్లు ముస్లిం మైనారిటీలవే. 2014 ఎన్నికల్లో వైసీపీ ఈ సీటును ముస్లింలకే కేటాయించిన వైసీపీ 2019లో వెల్లంపల్లికి కేటాయించగా ఆయన గెలుపొందారు. అయితే గత కొంతకాలంగా నియోజకవర్గంలో ఉన్న మైనార్టీ నేతలకు, వెల్లంపల్లి శ్రీనివాసరావుకు గ్యాప్ ఏర్పడినట్లు తెలుస్తోంది. వెల్లంపల్లి శ్రీనివాసరావు తమను పట్టించుకోవడం లేదనే అసంతృప్తి వెల్లబుచ్చుతున్నట్లు తెలుస్తోంది.వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ముస్లిం మైనారిటీలు ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాసరావు పట్ల అసంతృప్తితో రగిలిపోతున్నట్లు తెలుస్తోంది. ఈ నియోజక వర్గానికి చెందిన తమను కాదని టీడీపీ హయాంలో జలీల్‌ఖాన్‌తో సన్నిహితంగా ఉన్న వక్ఫ్‌బోర్డ్ మెంబర్, సెంట్రల్ నియోజకవర్గ నాయకుడు రుహుల్లాకి వెల్లంపల్లి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపిస్తున్నారు. వెల్లంపల్లిని ఎంతో కష్టపడి గెలిపించామని అయితే ఆయన తీరులో మార్పు రావడంతో వచ్చే ఎన్నికల్లో తమకే టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారట. పశ్చిమ నియోజకవర్గానికే చెందిన మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఆసిఫ్ వర్గం ఎమ్మెల్యే వెల్లంపల్లిపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారట. ఇందుకోసమే వచ్చే ఎన్నికల్లో తమ వర్గానికి చెందిన వ్యక్తికి టికెట్ ఇవ్వాలని అధిష్టానం వద్ద మొర పెట్టుకుంటున్నట్లు తెలుస్తోంది.



అంతేకాదు పార్టీలో చీలికలు తీసుకువస్తున్నారని టాక్ వినిపిస్తోంది. వైసీపీలో వర్గాలను పెంచి పోషిస్తున్నారని ఫలితంగా వచ్చే ఎన్నికల్లో వెల్లంపల్లికి టికెట్ ఇవ్వొద్దని పలువురు అధిష్టానానికి ఫిర్యాదు చేసినట్లు కూడా వార్తలు వినిపిస్తున్నాయి.విపక్షాలపై విరుచుకుపడే మాజీమంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావు గత కొన్ని రోజులుగా సైలెంట్ అయినట్లు తెలుస్తోంది. ఒకప్పుడు విమర్శించేందుకు ఏ అవకాశం వచ్చినా వదులుకోని వెల్లంపల్లి శ్రీనివాసరావు ఈసారి ఎన్ని అవకాశాలు వచ్చినా పట్టించుకోవడం లేదని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇందుకు సైతం కారణాలు లేకపోలేదని తెలుస్తోంది. అటు పవన్ కల్యాణ్ ఇటు చంద్రబాబు మరోవైపు నారా లోకేశ్‌లపై విమర్శలు చేసే వెల్లంపల్లిపై తీవ్ర వ్యతిరేకత వచ్చినట్లు సర్వేలలో తేలింది. అంతేకాదు విజయవాడ కనకదుర్గ ఆలయంలో వెల్లంపల్లి శ్రీనివాసరావు ఆధిపత్యం ఇంకా తగ్గలేదని దీంతో వైసీపీలోని ఓ వర్గం అక్కసు వెళ్లగక్కుతుందని తెలుస్తోంది. ఇప్పటికే ఈ అంశంపై వరుస ఫిర్యాదులు అందినట్లు తెలుస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో కొన్ని రోజులు మౌనం వహించడం మంచిదని వైసీపీ అధిష్టానం సూచించినట్లు తెలుస్తోంది.మంత్రిగా ఉన్నప్పుడు ఎమ్మెల్యే మల్లాది విష్ణుతో వెల్లంపల్లికి పొసగలేదని తెలుస్తోంది. అంతేకాదు విజయవాడ వైసీపీ నాయకులతోనూ విభేదాలు ఉన్నాయి. ఇదే సమయంలో జగ్గయ్యపేట వైసీపీ ఎమ్మెల్యే సామినేని ఉదయభానుపై వెల్లంపల్లి శ్రీనివాసరావు చేసిన వ్యాఖ్యలు అప్పట్లో కలకలం రేపిన సంగతి తెలిసిందే. విజయవాడ నగర వైసీపీ అధ్యక్షుడు బొప్పన భవకుమార్ ఇంట్లో జరిగిన ఓ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఉదయభాను హాజరయ్యారు. ఆయనను చూసిన వెల్లంపల్లి శ్రీనివాసరావు ఆగ్రహంతో ఊగిపోయారు. సీఎం వద్దకు తన నియోజకవర్గానికి చెందిన ఆకుల శ్రీనివాస్‌ను తీసుకెళ్లటానికి నువ్వు ఎవరు? పోటుగాడివా? అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దీనికి ఉదయభాను సైతం గట్టిగానే కౌంటర్ ఇచ్చారు. నేను పార్టీలో సీనియర్‌ను. నీలా పదవి కోసం పార్టీ మారలేదు. మూడు పార్టీలు మారిన ఊసరవెల్లివి నువ్వు.. నోరు అదుపులోకి పెట్టుకొని మాట్లాడు అని వార్నింగ్ ఇచ్చారు. ఈ పరిణామాలన్నీ వెల్లంపల్లి శ్రీనివాసరావు సీటుకు ఎసరు తీసుకువచ్చేలా ఉన్నట్లు తెలుస్తోంది. మరి వచ్చే ఎన్నికల్లో వెల్లంపల్లి శ్రీనివాసరావుకు టికెట్ దక్కుతుందా లేక వేరొకరికి దక్కుతుందా అనేది వేచి చూడాలి.

# వైసీపీలో రమ్యశ్రీ మళ్లీ యాక్టివ్

**హైదరాబాద్ :**

ఏపీలో ఎన్నికలకు ఏడాది సమయం కూడా లేదు. ఏప్రిల్‌లో ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. ఒకవేళ ముందస్తు ఎన్నికలు జరిగితే డిసెంబర్‌లోనే ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. ఈ పరిణామాలన్నింటిని పరిశీలిస్తే ఎన్నికలకు సమయం లేదు అనేది సత్యం. అందుకే ఇప్పటికే వైసీపీ ఎన్నికల ప్రచారం సైతం నిర్వహించేస్తోంది. ఇక ఎన్నికల ప్రచారం అంటే సినీ గ్లామర్ కూడా అత్యంత కీలకం. గత ఎన్నికల్లో వైసీపీకి సినీనటులు భారీగానే ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వారిలో చాలా మంది నటులు వైసీపీకి దూరం అయ్యారు. కొంతమంది సినీనటులు బీజేపీలో చేరితో మరికొంతమంది జనసేనలో చేరిపోయారు. ఇంకొందరు అయితే దాదాపు సైలెంట్ అయిపోయారు. వైసీపీలో పోసాని కృష్ణమురళి, అలీలు చాలా యాక్టివ్‌గా ఉన్నారు. మిగిలిన నటులు అంతగా కనిపించడం లేదు. దీంతో వచ్చే ఎన్నికల్లో వైసీపీ తరపున సినీ ఇండస్ట్రీకి చెందిన వారు ఎవరు ఎలక్షన్ కాంపైన్‌లో పార్టిసిపేట్ చేస్తారనే దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఇలాంటి తరుణంలో గ్లామర్ నటి రమ్యశ్రీ మళ్లీ యాక్టివ్ అయ్యారు. 2019 ఎన్నికలకు ముందు సినీనటి రమ్యశ్రీ వైసీపీలో చేరారు. అనంతరం విశాఖలోని పలువురు వైసీపీ అభ్యర్థుల గెలుపు కోసం అహర్నిశలు శ్రమించి గెలుపులో కీలకభాగస్వామిగా మారారు. అనంతరం ఆమె వైసీపీలో పదవి ఆశించి భంగపడ్డారు. అప్పటి నుంచి సైలెంట్ అయిపోయిన రమ్యశ్రీ ఇప్పుడు దూకుడు పెంచారు. టీవీ డిబేట్లలో తనదైన శైలిలో విపక్షాలపై విరుచుకుపడుతున్నారు. దీంతో రమ్యశ్రీ స్టార్ కాంపైనర్‌గా ఉంటారా? లేక వైసీపీ తరపున పోటీ చేస్తారా అన్న చర్చ జరుగుతుంది.సినీ నటి రమ్యశ్రీ అంటే తెలియని వారుండరు అనడంలో ఎలాంటి సందేహం లేదు. తెలుగు రాష్ట్రాల ప్రజలకు ముఖ్యంగా విశాఖ ప్రజలకు అత్యంత సుపరిచితం. అనేక సినిమాల్లో వ్యాంప్ తరహా పాత్రల్లో నటించి



ఏకంగా ఒక సినిమా కోసం టాప్ లెస్ గా కూడా నటించి అందర్నీ మెప్పించారు. టాలీవుడ్‌తో ప్రారంభమైన ఈమె సినీ కెరీర్ కన్నడ, తమిళ, మళయాల, హిందీ, భోజ్ పురి భాషలలో 400 చిత్రాలలో నటించి ప్రేక్షకుల మెప్పు పొందారు. అటు కన్నడలో హీరోయిన్‌గా 36 సినిమాల్లో నటించారు. రమ్యశ్రీ నటించిన ఆర్యభట్ట అనే కన్నడ చిత్రానికి కర్ణాటక రాష్ట్రప్రభుత్వ పురస్కారం కూడా లభించిన సంగతి తెలిసిందే. ఎక్కువగా శృంగార రస పాత్రలను పోషిస్తూ యువత కంటిమీద కునుకలేకుండా చేశారు. నటించడమే కాదు డైరెక్ట్ చెయ్యడమూ ఆమెకు వెన్నతోపెట్టిన విద్య. తాను పెరిగిన వాతావరణాన్ని పరిగణలోకి తీసుకుని ఒక గిరిజన యువతి సమస్యలను ప్రపంచానికి చాటిచెప్తూ మల్లి అనే చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ మూవీ పలు అవార్డులను సొంతం చేసుకుంది.సినీ నటిగానే కాదు సామాజిక సేవకురాలిగా కూడా రమ్యశ్రీకి మంచి పేరుంది. రమ్య హృదయాలయ ఫౌండేషన్ ద్వారా ఎందరో పేదలకు ఆపన్నహస్తం అందించింది. ఆమె సేవలను గుర్తించిన కాలిఫోర్నియాలోని నేషనల్ డీమ్డ్ యూనివర్శిటీ ఆమెను గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసి సత్కరించింది. తెలుగు సినీ ఇండస్ట్రీలో అక్కినేని నాగేశ్వరరావు తర్వాత నేషనల్ డీమ్డ్ యూనివర్శిటీ నుంచి అవార్డు అందుకున్న రెండో వ్యక్తిగా రమ్యశ్రీ చరిత్ర సృష్టించారు. అంతేకాదు జాతీయ మదర్ థెరిస్సా అనే అవార్డును సైతం రమ్యశ్రీ సొంతం చేసుకున్నారు. అంతేకాదు బీసీ సామాజిక వర్గం కోసం అలుపెరగని పోరాటం చేశారు. దీంతో ఆమె విశాఖపట్నం జిల్లాతోపాటు తెలుగు రాష్ట్రాల్లో ఆమెకంటూ ఓ గుర్తింపు ఉంది.మల్లి సినిమా అనంతరం రమ్యశ్రీ సినిమాల్లో నటించడం దాదాపు మానేశారు. అడపాదడపా నటిస్తూ.. బీసీ సామాజిక వర్గం బలోపేతంపై పోరాటం చేస్తున్నారు. అయితే 2019 ఎన్నికలకు ముందు ఆమె వైసీపీలో చేరారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరఫున ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. రమ్యశ్రీ సోదరులు ఒకరు టీడీపీ తరఫున, మరొకరు జనసేన తరఫున ఎన్నికల్లో పోటీ చేసినప్పటికీ రమ్యశ్రీ వారిని పట్టించుకోలేదు. సోదరులను సైతం పక్కనపెట్టి వైసీపీ అప్పగించిన బాధ్యతల ప్రకారం చెట్టి ఫాల్గుణ గెలుపుకోసం కృషి చేశారు. అరకు నియోజకవర్గాన్ని జల్లెడపట్టారు. మండుటెండలను సైతం లెక్కచేయకుండా వైసీపీ గెలుపులో కీలకభూమిక పోషించారు రమ్యశ్రీ. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆమెకు నామినేటెడ్ పదవి వరిస్తుందని అంతా భావించారు కానీ ఆమెకు ఎలాంటి పదవులు రాలేదు. దీంతో ఆమె సైలెంట్ అయిపోయారు.సినీ ఇండస్ట్రీలో చాలా యాక్టివ్‌గా ఉండే రమ్యశ్రీ ఇక రాజకీయాల్లోనూ వైసీపీ నేతగా అంతే దూకుడు ప్రదర్శించారు. అటు ఎన్నికల ప్రచారంలో విపక్షాలకు చుక్కలు చూపించారు. ఇటు ఇంటర్వ్యూలతో ప్రతిపక్షాలపై విరుచుకుపడ్డారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కోసం నా అన్నవారిని సైతం పక్కన పెట్టిన రమ్యశ్రీని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మంచి గుర్తింపు ఇస్తుందని అప్పట్లో ప్రచారం జరిగింది. కానీ అవేమీ జరగలేదు. అప్పట్లో ఇంటర్వ్యూలలో ఇక తనకు టూరిజం శాఖ మీద ఆసక్తి ఎక్కువ అని ఆమె తెలిపారు. పోనీ ఆశాఖకు సంబంధించి ఏదైనా నామినేటెడ్ పోస్టు అయినా దక్కుతుందని అంతా భావించారు. అది కూడా ఇవ్వలేదు. దీంతో ఆమె సైలెంట్ అయ్యారు.ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రమ్యశ్రీ మళ్లీ తెరపైకి వచ్చారు. టీవీ డిబేట్లలో వైసీపీ తరుఫున దుమ్ముదులిపేస్తున్నారు. అటు జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఇటు చంద్రబాబు నాయుడులపై తనదైన శైలిలో విరుచుకుపడుతున్నారు. దీంతో రమ్యశ్రీ వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తారా? లేక కేవలం స్టార్ కాంపైనర్‌గానే ఉంటారా అన్న చర్చ రాజకీయ వర్గాల్లో జరుగుతుంది. చెట్టి ఫాల్గుణకు సర్వేలో సానుకూలంగా లేకపోవడంతో రమ్యశ్రీ పోటీ చేస్తారనే గుసగుసలు సైతం వినిపిస్తున్నాయి.

## ఏపీ ప్రభుత్వ సలహాదారులపై కాంగ్రెస్ నేత తులసిరెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజం

**అమరావతి :**

ఏపీ ప్రభుత్వ సలహాదారులపై కాంగ్రెస్ నేత తులసిరెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆయన మీడియతో మాట్లాడారు. "సలహాదారులు కాదు.. స్వాహాదారులు. ఒక్క మైనారిటీ శాఖకే నలుగురు సలహాదారులా! వైసీపీ నాయకులకు ఉపాధి హామీ పథకం. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కడు దయనీయం. మింగమెతుకు లేదు.. మీసాలకు సంపంగి నూనె అన్నట్లు ఒక్కొక్క సలహాదారుని మీద నెలకు రూ.5 లక్షలు ఖర్చు. సలహాలు ఇచ్చిందీ లేదు.. స్వీకరించిందీ లేదు. కోర్టులు అక్షింతలు వేసినా పట్టించుకోవడం లేదు. సలహాదారుల నియామకానికి స్వస్తి పలకాలి." అని ఆయన కోరారు.ఒక వైపు పార్లమెంట్ నూతన భవన ప్రారంభోత్సవానికి ఆహ్వానించకుండా మోడీ ప్రభుత్వం భారత రాష్ట్రపతిని అవమానిస్తూ ఉంటే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు మోడీ ప్రాపకం కోసం ప్రాకులాడడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. జగన్ రెడ్డి భజన్ రెడ్డిగా.. చంద్రబాబు చెక్క భజన బాబుగా మారడం శోచనీయమని తులసిరెడ్డి ఎద్దేవా చేశారు.

## వడగాల్పులతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి

**అమరావతి :**

రాష్ట్రంలో ఎండ ప్రభావం అధికంగా ఉంది. భానుడి ప్రతాపం ఓ వైపు, మరోవైపు వడగాల్పులతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్న పరిస్థితి. రాష్ట్రంలో వడగాల్పుల తీవ్రతపై ఏపీ విత్తుల నిర్వహణ సంస్థ ఎప్పటికప్పుడు తగు సూచనలు ఇస్తూనే ఉంది. ప్రతీరోజు ఏయే ప్రాంతాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందో ప్రజలకు తెలియజేస్తోంది. వడగాల్పులతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచిస్తోంది. 84 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ప్రకటించింది. మిగిలిన చోట్ల కూడా ఎండ ప్రభావం చూపే అవకాశం ఉందని పేర్కొంది. ప్రజలు ఎండ తీవ్రత పట్ల అప్రమత్తంగా ఉండాలని, వృద్ధులు, గర్భిణిలు, బాలింతలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రయాణాల్లో ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డా.బి.ఆర్ అంబేద్కర్ సూచనలు చేశారు.

## రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం పెద్దపీట

**మంత్రి గంగుల కమలాకర్**



రోడ్ల నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని...కరీంనగర్ నగరంలో 14.5 కిలోమీటర్ల పరిధిలలోని వివిధ కారణాలతో ధ్వంస మైన బీటీ రోడ్డు పునరుద్ధరణ పనులకు 5కోట్ల 41లక్షలతో పనులు చేపడుతున్నట్టు మంత్రిగంలో కమలాకర్ వెల్లడించారు..నేడు శుక్రవారం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి చౌరస్తాలో నగర మేయర్ యాదగిరి సునీల్ రావు తో కలిసిరోడ్డు పునరుద్ధరణ పనులకు భూమి బీసీ సంక్షేమ పౌరసరఫరాల శాఖ మంత్రివర్యులు గంగుల కమలాకర్ పూజ చేశారు.. ఈ సందర్భంగా మాంత్రి గంగుల కమలాకర్మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు, మంచి నీటి పైపులైన్ల తవ్వకాలతో చాలాచోట్ల బీటీ రోడ్లు ధ్వంసం అయ్యాయని... వాటి పునరుద్ధరణ పనులకు తెలంగాణ ప్రభుత్వం అడగగానే నిధులు కేటాఇంచిందని అన్నారు... రాష్ట్ర ప్రభుత్వంరోడ్ల నిర్మాణానికి పెద్దపీట వేస్తుందని అన్నారు.. రోడ్డు నిర్మాణ పనులు వర్షాకాలం లోపు త్వరితగాతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్ ను ఆదేశించారు..ఈ కార్యక్రమం లో నగర మేయర్ యాదగిరి సునీల్ రావు కార్పొరేటర్లు మేచినేని వేచినేని వనజ –అశోక్ రావు, నాంపల్లి శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యులు అంజాత్, గౌతమ్ రెడ్డి,ఆర్ డబి ఈ ఈ సాంబశివరావు డి ఈ రవీందర్, ఏ ఈ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు..

## ముఖ్యమంత్రి పర్యటన కు పకడ్బంది భద్రతా ఏర్పాట్లు

**కర్నూలు**

ఈ నెల 30 వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్.జగన్ మోహన్ రెడ్డి పత్తికొండ రాక సందర్భంగా భద్రత పరంగా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కర్నూలు రేంజ్ డిఐజి ఎస్. సెంథిల్ కుమార్, జిల్లా ఎస్పీ జి. కృష్ణకాంత్ ఆదేశించారు. శుక్రవారం వారిద్దరూ , ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ , పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ తో పాటు గారు సభా ప్రాంగణం వద్ద జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు.

పత్తికొండ సెయింట్ జోసెఫ్ స్కూల్ లో రైతు భరోసా కార్యక్రమం జరగనున్న సంధర్భంగా హెలిప్యాడ్ , పోలీసు బందోబస్తు, వాహనాల పార్కింగ్, తదితర ఏర్పాట్లకు సంబంధించి సమన్వయంతో పని చేయాలని , ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.

ముఖ్యమంత్రి బహిరంగ సభకు వచ్చే ముఖ్యమైన రహదారులను, రూట్ బందోబస్తులను పరిశీలించారు. పోలీసు అధికారులకు సిబ్బందికి తగిన సూచనలు, సలహాలను చేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ శ్రీనివాసులు , సిఎం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ రజనీ, ఆర్డీవో మోహన్ దాసు, ఎమ్మార్వో విష్ణు ప్రసాద్ , సిఐలు ప్రసాద్, ఆదినారాయణ రెడ్డి, రామకృష్ణారెడ్డి, మురళీ కృష్ణ పాల్గొన్నారు.

# అతనో రోజు కూలీ.. తెల్లారేసరికి అకౌంట్‌లో రూ.100 కోట్లు...

**కోల్ కత్తా :**

అకౌంట్‌లో పొరపాటున రూ.100 పడితేనే చాలామంది మురిసిపోతుంటారు. మరి తెల్లారేసరికి ఖాతాలో రూ.100 కోట్లు పడితే!!.. నిజజీవితంలో ఇలాంటివి ఎందుకు జరుగుతాయిలే.. ఏదో కల వరకైతే ఓకే అని అనుకుంటున్నారా?. కానీ పశ్చిమబెంగాల్‌కు చెందిన ఓ రోజు కూలీకి కల లాంటి నిజం అనుభవపూర్వకంగా ఎదురైంది. మహ్మద్ నసీరుల్లా మండల్ అనే వ్యక్తి రాత్రికి రాత్రే రూ.100 కోట్లకు అధిపతయ్యాడు. పడుకునే ముందు అకౌంట్‌లో కేవలం రూ.17 మాత్రమే ఉండగా తెల్లారేసరికి రూ.100 కోట్లు వచ్చిపడ్డాయి. ఎలా పసిగట్టారో ఏమోగానీ దేగన సైబల్ సెల్ డిపార్ట్‌మెంట్ అధికారులు మండల్ ఇంటికెళ్లి నోటీసులు ఇచ్చారు. అధికారులు వచ్చి నోటీసులు ఇచ్చే వరకు అకౌంట్‌లో వంద కోట్లు ఉన్నాయనే విషయం అతడికి తెలియదు. మే 30న విచారణకు రావాలని అధికారులు కోరారు. ఒక్కసారిగా ఇంత పెద్ద మొత్తంలో డబ్బు ఎలా వచ్చిందో వివరణ ఇవ్వాల్సిందిగా నోటీసుల్లో స్పష్టం చేశారు. దీంతో రూ.100 కోట్లు పడ్డాయనే సంతోషం కూసింత కూడా లేకపోగా విచారణలో ఏం చెప్పాలో తెలియక కలవరపడుతున్నాడు.అనూహ్యమైన ఈ పరిణామంపై నసీరుల్లా మండల్ తీవ్రంగా ఆందోళన చెందుతున్నాడు. " పోలీసుల నుంచి కాల్ వచ్చిన నాటి నుంచి నాకు నిద్ర పట్టడం లేదు. ఏం చెయ్యాలో నాకు తెలియదు. నా బ్యాంక్ అకౌంట్‌లో రూ.100 కోట్లు ఉన్నాయి. మొదటిసారి నమ్మలేకపోయాను. కానీ మళ్లీ మళ్లీ చెక్ చేసుకున్న తర్వాత గానీ అవి రూ.100 కోట్లని నమ్మలేకపోయాను" అని మండల్ గుర్తుచేసుకున్నాడు. గూగుల్ పేలో చెక్ చేసుకుంటే ఏడు అంకెల సంఖ్యలో డబ్బు ఉందని, ఇంత పెద్ద మొత్తంలో డబ్బు తన ఖాతాలోకి ఎలా వచ్చిందో తెలుసుకునేందుకు తన అకౌంట్ ఉన్న పీఎన్‌బీ బ్యాంక్ బ్రాంచ్‌కు వెళ్లాననని వివరించాడు." ఇంత పెద్దమొత్తంలో డబ్బు నా ఖాతాలో ఎలా వచ్చిపడిందో నేను చెప్పలేను. నేను రోజు కూలీగా పనిచేసుకుంటున్నాను. ఏదైనా కేసు పెడతారా లేక పోలీసులు కొడతారా అన్న భయంతోనే బతుకుతున్నాను. ఇంట్లో వాళ్లంతా ఏడుస్తున్నారు" అని మండల్ తన బాధను వివరించాడు. పాస్‌బుక్ తీసుకుని బ్యాంక్‌కు వెళ్తే రూ.100 కోట్లు పడడానికి ముందు కేవలం రూ.17 మాత్రమే ఉన్నాయని చెప్పారని తెలిపాడు. బ్యాంక్ అధికారులు తన ఖాతాను బ్లాక్ చేశారని, కేసు నమోదవ్వడంతో ఇంతకుమించి వివరాలు ఇవ్వలేమని బ్యాంక్ వాళ్లు చెబుతున్నారని వాపోయాడు. ఈ డబ్బు ఎవరిదైతే వాళ్లు తీసుకోవచ్చునని, ఇంత డబ్బుతో తానేం చేసుకుంటానని ఆవేదన వ్యక్తం చేశాడు. కాగా నసీరుల్లా మండల్ ముర్షిదాబాద్‌లోని బసుదెబ్‌పుర్ గ్రామానికి చెందిన వ్యక్తి. రోజు కూలీగా కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రూ.100 కోట్లు ఖాతాలో పడ్డ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడి కావాల్సి ఉంది

# కవితకు బిగిస్తున్న ఉచ్చు ?

**హైదరాబాద్ :**

ఢిల్లీ లిక్కర్ స్కాంలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత టార్గెట్‌గా జైల్లో ఉన్న సుఖేష్ చంద్రశేఖర్ తన అడ్వకేట్ ద్వారా మరో లేఖ విడుదల చేశారు. ఐదు పేజీల ఈ లేఖలో కవిత, అరవింద్ కేజ్రీవాల్‌పై సుఖేష్ సంచలన ఆరోపణలు చేశాడు. కవిత సెల్ కంపెనీల ఖాతాల నుంచి రూ.80 కోట్ల నిధులు మళ్లించినట్లు బాంబు పేల్చాడు. ఈ నిధులను మారిషస్‌కు మళ్లించినట్లు ఆరోపించాడు. ఈ మేరకు దీనికి సంబంధించిన ఆధారాలను బయటపెట్టాడు. ఢిల్లీ మంత్రి కైలాష్ గెహ్లాట్‌కు చెందిన గ్రీన్ హస్క్ కంపెనీలకు రూ.80 కోట్లు తరలించినట్లు సుఖేష్ తెలిపాడు. కైలాష్ గెహ్లాట్ బంధువుల ఖాతాలకు నగదు బదిలీ చేసినట్లు చెప్పాడు. 25+25+30 కోట్లు నగదు బదిలీలు జరిగాయని, నగదు బదిలీలపై కేజ్రీవాల్ చాట్స్ వివరాలను కూడా త్వరలోనే విడుదల చేస్తానన్నాడు. వాస్తవాలను బయటపెడుతున్నందుకే తనను మానసికంగా వేధిస్తున్నారని, తమకు అనుకూలమైన జైలు అధికారులతో వేధింపులకు గురి చేస్తున్నట్లు ఆరోపించాడు. వేధింపులపై జాతీయ మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు చేసినట్లు లేఖలో పేర్కొన్నాడు. ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఇంటి నిర్మాణంపై సుఖేష్ చంద్రశేఖర్ పలు ఆరోపణలు చేశాడు. కేజ్రీవాల్ ఇంటి ఫర్నిచర్ ఖర్చులను తానే భరించానని, ఫర్నిచర్ బిల్లులు తన దగ్గర ఉన్నాయని తెలిపాడు. త్వరలో కేజ్రీవాల్‌కు సంబంధించిన మరో కుంభకోణాన్ని బయటపెడతానని అన్నాడు. కేజ్రీవాల్ ఫేస్‌టైమ్ చాట్‌ల స్క్రీన్‌షాట్‌లను విడుదల చేస్తానని, కేజ్రీవాల్ సూచనలతోనే తాను రూ.80 కోట్లు బదిలీ చేసినట్లు సుఖేష్ చెప్పాడు. నగదును యూఎస్‌బీటీ, క్రిప్టో కరెన్సీకి మార్చడిందని, కేజ్రీవాల్ సూచనతోనే అబుదాబికి నగదు పంపారని సుఖేష్ చంద్రశేఖర్ లేఖ ద్వారా చెప్పుకొచ్చాడు.అయితే గతంలోనూ కవిత పాత్రకు సంబంధించి రెండు లేఖలను సుఖేష్ విడుదల చేశాడు. కవితతో తాను వాట్సప్‌లో ఛాట్ చేసిన స్క్రీన్‌షాట్లను కూడా బయటపెట్టాడు. ఈ వాట్సప్ ఛాట్‌లో నిధుల లావాదేవీలకు సంబంధించి కోడ్ భాషలో కవిత, సుఖేష్ మాట్లాడుకున్నారు. సుఖేష్ వ్యాఖ్యలను కవిత ఖండిస్తూ వస్తున్నారు. అతడెవరో తనకు అసలు తెలియదని, వాట్సప్ ఛాట్‌లు ఫేక్ అని చెప్పారు. కాగా లిక్కర్ స్కాంలో కవిత ఇప్పటికే సీబీఐ, ఈడీ విచారణకు హాజరయ్యారు. కవిత ఫోన్లను కూడా ఈడీ స్వాధీనం చేసుకుంది. ఈ కేసులో కవిత పాత్ర ఉన్నట్లు దర్యాప్తు సంస్థలు గుర్తించాయి.

# బ్రాహ్మణీయ పాలనలో దళితులకు అవమానాలే

**మంథని**



నాటి నుంచి నేటి వరకు బ్రాహ్మణీయ పాలనలో దళిత సామాజిక వర్గానికి అవమానాలే ఎదురవుతున్నాయని పెద్దపల్లి జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్ ఆవేదన వ్యక్తం చేశారు.మంథని మున్సిపల్ పరిధిలోని అంబేద్కర్‌నగర్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన పలు విషయాలను వెల్లడించారు. అనేక రంగాల్లో అభివృద్ధి చెందుతున్న ఈ సమాజంలో కులాలు మతాలకు సంబంధం లేకుండా కలిసి మెలిసి ఉంటున్న క్రమంలో కూడా మంథని దళిత కాలనీలోని దళితుల ఇండ్లలో ఏ కార్యం జరిగినా బ్రాహ్మణులు రాని దుస్థితి ఉందని ఆయన వాపోయారు. మంథని నియోజకవర్గంలో అనేక ఏండ్లు పరిపాలన చేసిన దుదిళ్ల కుటుంబ పాలనలో దళిత కాలనీపై చిన్నచూపే మిగిలిందని, ఇప్పటి వరకు ఏ ఇంటికి పురోహితులు రావడం లేదని, ఈ సమాజంలో మాదిగలు అంత ముట్టుకోని వారా అని ఆయన ప్రశ్నించారు. 40ఏండ్ల పాలనలో ఒక కుటుంబం చేస్తున్న అన్యాయాలను, వ్యవహారశైలిని ప్రజలకు విమర్శిస్తుంటే నిత్యం తనను ఎంతో మంది తిడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలో ఉంటే దుద్దిళ్ల కుటుంబానికి వత్తాసు పలుకుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నాయకులు ఇకనైనా ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఈర్ల కొమురయ్య మున్నూరు కాపు అని, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన నాయకుడని, అక్బర్‌ఖాన్ మైనార్టీ నాయకుడని వీళ్లంతా దుద్దిళ్ల కుటుంబ మాయమాటలు నమ్మి ప్రతిరోజు తనను తిడుతున్నారని, ఎందుకు వీళ్లు తిడుతున్నారో అర్థం కావడం లేదన్నారు. తాను ఈ వర్గాలకు ఏమైనా అన్యాయం చేశానా అని ఆయన ప్రశ్నించారు.బ్రాహ్మణీయ పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు అన్యాయం జరుగుతోందని, మన ఓట్లతో అధికారం చేపట్టి అనేక పదవులు అనుభవిస్తూ వాళ్ల కుటుంబాన్ని బాగు చేసుకున్నారే కానీ మన వర్గాలకు ఏమైనా న్యాయం చేశాడా అని ఆలోచన చేయాలని ఆయన హితవు పలికారు. 2007లో టీటీడీ చైర్మన్‌గా కరుణాకర్‌రెడ్డి ఉన్నసమయంలో తిరుమల తిరుపతి వెంకటేశ్వరస్వామిని దళిత గోవిందం పేరుతో దళిత వాడల్లో తీసుకెళ్లాడని, బ్రాహ్మణేతరులు ఉంటేనే ఇలాంటిది సాధ్యమవుతుందని కరుణాకర్‌రెడ్డి నిరూపించారని అన్నారు. 2007లోనే వెంకన్నస్వామిని దళిత వాడల్లోకి తీసుకెళ్తే స్వాతంత్ర్యం వచ్చి 75ఏండ్లు దాటినా మంథనిలోని అంబేద్కర్ కాలనీలోని దళితుల ఇండ్లకు పురోహితులు రాని పరిస్థితులకు కారణం ఎవరో ఆలోచన చేయాలన్నారు. మంథని ఎమ్మెల్యేకు దళితులపై చిత్తశుద్ధి ఉంటే మంథనిలోని అంబేద్కర్‌నగర్‌కు పురోహితులను పంపించాలని ఆయన డిమాండ్ చేశారు. 2007లో దేశంలోనే ప్రసిద్ధి గాంచిన పుణ్యక్షేత్రమైన తిరుమల తిరుపతి దేవస్థానం వాళ్లే దళితగోవిందం కార్యక్రమం పెట్టి స్వామివారిని దళితకాలనీలకు తీసుకెళ్తే 2023వరకు మంథనిలోని అంబేద్కర్‌నగర్ ఒక్క పురోహితుడినైనా పంపించాల్సిన బాధ్యత ఎమ్మెల్యేకు లేదా అని ఆయన ప్రశ్నించారు. దళితుల ఓట్లతో గెలిచి అధికారంలో ఉంటూ దళిత కాలనీలకు ఏం చేశారో చెప్పాలని, ఎంత మంది దళితులకు ఇండ్లు కట్టిచ్చారో చెప్పాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. 40ఏండ్లలో అధికారంలో ఉన్న దుద్దిళ్ల కుటుంబం ఏ వర్గానికి మేలు చేయలేదని, కేవలం పదవుల కోసమే ఆరాటపడ్డారే కానీ అట్టడుగు వర్గాల గురించి ఆలోచన చేయలేదని ఆయన విమర్శించారు. చదువుకున్న విజ్ఞానవంతులని దళితులు మీకు ఓట్లు వేస్తే వాళ్లను అంటరానివాళ్లుగానే చూడటం న్యాయమా అని ఆయన అన్నారు. నియోజకవర్గంలో అనేక ఏండ్ల బ్రాహ్మణీయ పాలనలో జరుగుతున్న అన్యాయాలను ప్రజలకు వివరించే ప్రయత్నం చేస్తుంటే ప్రజలకు అర్థం కావడం లేదని, పదేపదే చెబుతున్నా చర్చించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం మా సారు మంచోడని భజన చేసే కాంగ్రెస్ పార్టీలోని ఎస్సీ, ఎస్టీ,బీసీ మైనార్టీ నాయకులు ఆలోచన చేయాలని, దళితుల ఇండ్లకు పురోహితులు ఎందుకు పోవడం లేదని ప్రశ్నించాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో మంథని మున్సిపల్ చైర్మన్ పుట్ట శైలజ, వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్, ఎంపీపీ కొండా శంకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎక్కేటి అనంతరెడ్డి, సింగల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, కౌన్సిలర్లు వీకే రవి, శ్రీపతి బానయ్య, గద్రేపల్లి సత్యనారాయణ, నాయకులు ఏగోలపు శంకర్ గౌడ్, తగరం శంకర్ లాల్, కొట్టే రమేష్, లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు హైవేలో డిజిటల్ స్పీడో మీటర్

**నెల్లూరు**

అత్యంత వేగంగా వెళ్లే వాహనాలు వలన రోడ్డు ప్రమాదాలు ఎక్కువ గా జరుగుతున్నాయి. ఈ ప్రమాదం ఏ స్థాయి లో ఉంటుందో తెలుపుటకు గూడూరు హైవే మీద జరిగినా ప్రమాదాన్ని సిసి కెమెరా లో రికార్డుయన వీడియోను పోలీసులు విడుదల చేసారు. అత్యంత వేగంగా వాహనాలు నడుపుతూ ప్రాణాలు మీదకి తెచ్చుకుంటున్నారు. పోలీస్ అధికారులు కొన్నిచోట్ల. ఎంత స్పీడ్ పోవాలో నిర్ణయించి అక్కడ బోర్డు పెట్టినప్పటికీ ఆ బోర్డు చూస్తూ కూడా అంత కన్నా వేగంగా వాహనాలు నడుపుతూ వెళుతుంటారు. అత్యంత వేగమే ఎన్నో జీవితాలన్నీ బలిగొంది . ఆ వేగమే ఎన్నో కుటుంభాలను నిరాశ్రయులను చేసింది.

ఈ క్రమంలో ఆ ప్రమాదాలు అరికట్టేందుకు గూడూరు పోలీసు అధికారులు ప్రతిష్టాత్మకంగా డిజిటల్ స్పీడో మీటర్ గన్ అనే యంత్రాన్ని ప్రవేశపెట్టారు . గూడూరు డిఎస్పి సూర్యనారాయణ రెడ్డి, రూరల్ సిఐ దశరధ రామారావు ,రూరల్ ఎస్సై బ్రహ్మనాయుడు, స్పిడో మిటర్ గన్ గూడూరు హైవే లో లాంఛనంగా ప్రాంభించారు. స్పీడ్ గన్ పనితీరును డిఎస్పి పరిశీలించారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నియంత్రణ లో భాగంగా ప్రజల శ్రేయస్సు కోరి డిజిటల్ స్పిడో మిటర్ గన్ ను హైవే వద్ద అమర్చడం జరుగుతుందని అన్నారు. ట్రాఫిక్ నియమ నిబంధనలు ప్రకారం నిర్ణయించిన స్పీడ్ కన్నా ఎక్కువ స్పీడ్ లో వాహనాలు వెళుతుంటే ఆటోమేటిక్గా ఈ యంత్రం ఫోటో తీసి వాహనా యజమానికి ఫైన్ బిల్లు పాస్ చేస్తుందని తెలిపారు. కావున వాహనాదారులు, ట్రాఫిక్ నియమానిబంధనలు తప్పకుండా పట్టించాలని పోలీసులు అధికారులు హెచ్చరించారు.

# శ్రీ కూర్మ ఆలయంలో నిత్యాన్నదానానికి ఏడాది

**శ్రీకాకుళం**

ప్రసిద్ధ పుణ్య క్షేత్రం శ్రీకూర్మం దేవస్థానంలో మంత్రి ధర్మాన ప్రసాదరావు చొరవతో ప్రారంభించిన నిత్యాన్నదాన కార్యక్రమానికి ఏడాది పూర్తయిన వేళ ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి ధర్మాన మాట్లాడుతూ.. దేశం నలుమూలల నుంచి వచ్చే భక్తులకూ, యాత్రికులకూ భోజన వసతి కల్పించడం ఆనందంగా ఉంది. దాతల సహకారంతో ఇటువంటి సమున్నత కార్యక్రమం ఏర్పాటు చేయగలిగాం. ఇందుకు సంబంధించి ట్రస్టు ఏర్పాటు చేసి,ఈ కార్యక్రమాన్ని నిరాటంకంగా చేస్తున్నాం. ఈ విషయమై ట్రస్టు బోర్డు మెంబర్లు చేస్తున్న కృషి ఎంతో సమర్థంగా ఉంది. వారి కృషి కారణంగానే రుచికరమైన, శుచికరమైన భోజనం అందించగలుగుతున్నాం. భోజనం విసుగుతో కాకుండా ప్రేమతో పెట్టాలి. అభిమానంతో పెట్టాలి. అతిథిని ప్రత్యేకించి గౌరవించి భోజనం పెట్టాలి. ఆ విధంగా ఇక్కడ నిత్యాన్నదానం చేస్తున్నవారు నడుచుకోవాలి. నిత్యాన్నదాన పథకం నిర్వహణ కోసం బ్యాంకులో జమ చేసిన డిపాజిట్ (సుమారు ఎనభై లక్షల రూపాయలు)ను మరింత పెంచేందుకు చాలా మంది ఆసక్తి గా ఉన్నారు. దాతల పేర్లు చెబుతూ ఇక్కడ నిత్యాన్నదానం చేస్తూ ఉన్నారు. ఇదెంతో మంచి కార్యక్రమం. జిల్లాలో ఉన్న వారంతా ఇందులో పాల్గొనాలి. అన్నదానం ద్వారా దక్కే గౌరవం మరో చోట దక్కదు. ఆ గౌరవాన్ని అంతా సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా జిల్లా వాసులకు విజ్ఞప్తి చేస్తూ ఉన్నాను అని మంత్రి ధర్మాన ప్రసాదరావు తెలిపారు.పాలక మండలి సభ్యులు డబ్బిరు శ్రీనివాస్, ముజేటి అప్పల కొండ, బోర కృష్ణ వేణి, కొనాడ లక్ష్మి, అనుపోజు నాగరాజు, ఉప్పాడ రమేష్, పుడి కమల, గొరు శ్యామల రావు, సిహెచ్ఎస్ఎన్ ఆచార్యులు, పొన్నాడ ఋషిశ్వరరావు,ఎంపిపి గోండు రఘురాం, సర్పంచ్ గోరు అనిత, యల్లా నారాయణ, కొయ్యన నాగభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

# అమర వీరుల స్మృతివనం అమరవీరుల ఫోటోలు చరిత్రను పెట్టాలి

**అమరవీరుల కుటుంబాల డిమాండ్**

**హైదరాబాద్ :**

రాష్ట్ర సచివాలయం ఎదుట నిర్మించి జూన్ 2 వతేదిన రాష్ట్ర ప్రభుత్వం ప్రారంబించబోయే అమర వీరుల స్మృతివనం అమర్ర జ్యోతి లో అమరవీరుల ఫోటోలు చరిత్రను పెట్టాలని అమరవీరుల కుటుంబాలు ముఖ్యమంత్రి కే.చంద్ర శేకర్ రావు కు విజ్ఞప్తి చేసారు.ఈ మేరకు శుక్రవారం స్మృతివనం అమర జ్యోతి లో అమరవీరుల ఫోటోలు చరిత్రను పెట్టాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ క్రాంతి దళ్ ఆద్వర్యం లో నాంపల్లి గన్ పార్క్ అమరవీరుల స్తూపం నివాళ్ళు అర్పించారు. ఈ సందర్బంగా తెలంగాణ క్రాంతి దళ్ రాష్ట్ర అధ్యక్షులు సంగంరెడ్డి పృద్వి రాజ్ మాట్లాడుతూ జూన్ రెండో తారీఖున తెలంగాణ అవతరణ దినోత్సవ రోజు తెలంగాణ కోసం తమా జీవితాలను త్యాగాలు చేసిన అమరవీరుల త్యాగాలను గుర్తించుకోవాలని నిర్మిస్తున్న అమర జ్యోతి అమరవీరుల ఫోటో లు లేకుండా కేవలం ముఖ్యమంత్రి ఫోటో పెట్టడం అన్యాయమన్నారు. తెలంగాణా ఉద్యమ పోరాటం లో 1200 మంది ప్రాణ త్యాగాలు చేసారని కాని వీరిలో ప్రభుత్వం 589 మందిని గుర్తించిందన్నారు.వీరి కుటుంబాల ను ఆదుకోడానికి , వారి బాగోగులకోసం జి.ఓ.నంబెర్ 80 తెసినప్పటికి నేడు దానిని కుడా రద్దుచేయడం దుర్మార్గామన్నారు. అమరవీరుల త్యాగాలు గుర్తుండే విదంగా భైరాన్ పల్లి మాదిరిగా కనీసం 589 మందికి సంబందించిన అమర జ్యోతిలో తెలంగాణ అమరవీరుల ప్రతి ఒక్కరి చరిత్ర ఫోటో ఉండాలని ఆయన డిమాండ్ చేసారు.ఈ కార్యక్రమంలో అమరుల కుటుంబ సభ్యులు బీసీ సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షులు బోల్క వెంకట్ యాదవ్, తెలంగాణ క్రాంతి దళ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# జనరల్ రూట్ పాస్‌కు రాయతీలు నేటి నుంచి ప్రయాణికులకు అందుబాటులో

**హైదరాబాద్:**

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ప్రయాణికుల సౌకర్యార్థం తొలిసారిగా జనరల్ రూట్ పాస్‌కు టీఎస్ఆర్టీసీ శ్రీకారం చుట్టింది. తక్కువ దూరం ప్రయాణించే వారి కోసం ప్రవేశపెట్టిన ఈ రూట్ పాస్ 27 (శనివారం) నుంచి ప్రయాణికులకు అందుబాటులోకి రానుంది. 8 కిలోమీటర్ల పరిధిలో రాకపోకలు సాగించే వారికి ఇది వర్తించనుంది. ఇప్పటికే టీ-24, టీ-6, ఎఫ్-24 టికెట్లతో ప్రయాణికులకు ఆర్టీసీ ప్రత్యేక రాయితీలను ఇస్తున్న విషయం తెలిసిందే.నగరంలో ఇప్పటికే ప్రయాణికులకు జనరల్ బస్‌పాస్ అందుబాటులో ఉంది. ఆర్డినరీ బస్‌పాస్‌కు రూ.1,150, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్‌పాస్‌కు రూ.1,300గా ధర ఉంది. సుదూర ప్రాంతాలకు వెళ్లే వారు మాత్రమే ఈ పాస్‌లను కొనుగోలు చేస్తున్నారని సంస్థ చేసిన సర్వేలో వెల్లడైంది. స్వల్ప దూరం వెళ్లే వారు బస్సుల్లో కాకుండా ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్తున్నారని తేలింది. తక్కువ దూరం ప్రయాణించే వారికి చేరువ కావడం కోసమే రూట్ పాస్‌ను తీసుకొచ్చినట్టు అధికారులు తెలిపారు.

రూట్‌పాస్‌లు రాయితీతో అందజేత

సాధారణంగా ఆర్డినరీ రూట్‌పాస్‌కు రూ.800, మెట్రో ఎక్స్‌ప్రెస్ రూట్‌పాస్‌కు రూ.1,200 ఉంటుంది. కొత్తగా ప్రారంభం నేపథ్యంలో ప్రయాణికులకు రూ.200 మేర రాయితీని కల్పించారు. సిటీ ఆర్డినరీ రూట్ బస్‌పాస్‌ను రూ.600, మెట్రో ఎక్స్‌ప్రెస్ రూట్‌పాస్ రూ.వెయ్యికి అందించనున్నారు. ఈ ధరతో పాటు ఐడీ కార్డుకు రూ.50 అదనంగా చెల్లించాల్సి ఉంటుంది.

వేసవిలో ప్రయాణికులను ఆకర్షించేలా గ్రేటర్ ఆర్టీసీ ప్రత్యేక ఆఫర్లు ప్రకటించింది. సమ్మర్‌లో విద్యాసంస్థలకు సెలవుల నేపథ్యంలో సిటీ బస్సుల్లో ప్రయాణికుల రద్దీ తగ్గకుండా టికెట్లపై రాయితీలు ప్రకటిస్తూ అదనపు ఆదాయమే లక్ష్యంగా ముందుకెళ్తోంది. అందులో భాగంగా ఏప్రిల్ 27 నుంచి రూ.100గా ఉన్న టీ-24 టికెట్ చార్జీని రూ.90 తగ్గించడంతో పాటు సీనియర్ సిటిజన్లకు రూ.80లకే వీటిని అందుబాటులోకి తెచ్చింది. ఇటీవల మహిళలకు ప్రత్యేకంగా టీ-24 టికెట్ చార్జీలను రూ.80లకు తగ్గించింది. ప్రస్తుతం విద్యా సంస్థలకు సెలవులు కావడంతో ఆ రూట్లలో నడిచే బస్సులను రద్దీ రూట్లలో నడిపించేందుకు చర్యలు చేపట్టింది.

టీ-6 టికెట్‌తో 6 గంటల ప్రయాణం..

నగరంలో ప్రైవేట్ ఆటోలో 2-3 కిలో మీటర్లు ప్రయాణం చేయాలన్నా రూ. 10నుంచి రూ.15 వరకు చార్జీ అవుతుంది. అదే ఆర్టీసీ బస్సుల్లో రూ.50 చెల్లించి టీ-6 టికెట్ తీసుకొని 6గంటలపాటు గ్రేటర్‌లో ఎక్కడి నుంచి ఎక్కడికైనా తిరగొచ్చు. కుటుంబసభ్యులు, స్నేహితులతో కలిసి బయటకు వెళ్లే వారి కోసం ఆర్టీసీ ఎఫ్-24 టికెట్ అందుబాటులోకి తెచ్చింది. రూ.300తో ఈ టికెట్ తీసుకొని నలుగురు 24 గంటలపాటుసిటీ బస్సుల్లో ఎక్కడికైనా వెళ్లొచ్చని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. ఏ ఆఫర్ టికెట్ అయినా బస్సుల్లో కండక్టర్ల వద్ద అందుబాటులో ఉంటాయని గ్రేటర్ ఆర్టీసీ ఈడీ ఈ.యాదగిరి తెలిపారు.

# వరి ధాన్యం లో తాలు తేమ శాతం లేకుండా చూసుకోవాలి

**నాగర్ కర్నూల్**



వరి ధాన్యంలో తాలు తేమ శాతం లేకుండా చూసుకోవాలని వ్యవసాయ అధికారి నాగార్జున్ రెడ్డి రైతులకు సూచించారు. శుక్రవారం నాగర్ కర్నూల్ జిల్లాలోని లింగాల మండల కేంద్రంలో వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు సందర్శించి రైతులతో వారు మాట్లాడారు.వరి ధాన్యం పండించిన ప్రతి రైతు కొనుగోలు కేంద్రంలోని విక్రయించాలని సూచించారు. తాలు తీయకుండా ధాన్యం నింపరాధని కొనుగోలు కేంద్రం నిర్వాహకులకు సూచించారు. తేమ శాతం పరీక్షించి ధాన్యం కొనుగోలు చేయాలని కోరారు. రైతులు తమ ధాన్యం నాన్యతగా తీస్కరావాలని సూసించారు . రైతులు పండించిన ధాన్యం పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తావని అధైర్య పడవద్దని రైతులకు సూచించారు.

# విప్లవ చిత్రాలతో ప్రజల్లో చైతన్య స్ఫూర్తి కలిగించిన మాదాల రంగారావు



విప్లవ చిత్రాలతో ప్రజల్లో చైతన్య స్ఫూర్తి కలిగించిన నటుడు, నిర్మాత, దర్శకుడు మాదాల రంగారావు, మాదాల రంగారావు స్వగ్రామం ప్రకాశం జిల్లా మైనంపాడు. 1948 మే 25న ఆయన జన్మించారు. వామపక్ష భావజాలం కలిగిన ఈయన అవినీతి, అణిచివేత లాంటి సామాజిక సమస్యలను ప్రతిబింబిస్తూ అనేక సినిమాలు రూపొందించాడు. నవతరం ప్రొడక్షన్స్ అనే నిర్మాణ సంస్థ స్థాపించాడు. మరో కురుక్షేత్రం, యువతరం కదిలింది, ఎర్రమల్లెలు, విప్లవశంఖం, నవోదయం, మహాప్రస్థానం, తొలిపొద్దు, ప్రజాశక్తి, బలిపీఠంపై భారతనారి, ఎర్రపావురాలు, స్వరాజ్యం, జనం మనం వంటి సినిమాల్లో నటించారు. నాంపల్లి స్టేషన్ కాడా రాజా లింగో, కాలేజీ కుర్రవాడ కులాసాగా తిరిగేటోడా, అమరవీరులెందరో అనే పాటలు అత్యంత ప్రజాదరణను పొందాయి. ప్రజా నాట్యమండలి లో క్రియాశీలక సభ్యుడిగా పని చేశారు. మరో ప్రముఖ దర్శకుడు టి. కృష్ణ, నిర్మాత పోకూరి బాబురావు ఈయన సహోధ్యాయిలు. రంగారావు కొడుకు మాదాల రవి. తండ్రి సినిమాల్లో బాల నటుడిగా నటించాడు. 1980-90 దశకంలో సామాజిక విప్లవ సినిమాలతో తెరపై సంచలనం సృష్టించాడు. వామపక్ష భావజాలంతో రూపొందిన వీరి చిత్రాలు మంచి ప్రజాదరణ పొందాయి. ఓ దశలో స్టార్ హీరోలకు ధీటుగా మాదాల నిర్మించిన చిత్రాలు కలెక్షన్లను సాధించాయి. వామపక్ష సిద్ధాంతాలకు అండదండగా వుంటూ తాను నిర్మించిన చిత్రాల ద్వారా వచ్చిన లాభాన్ని సీపీఎం పార్టీ కార్యాలయానికి విరాళంగా ఇచ్చేవాడు. ఉమ్మడి ఏపీలోని పలు ప్రాంతాల్లోని థియేటర్లలో ప్రదర్శించడం ద్వారా వచ్చిన లాభాన్ని స్థానిక సీపీఎం కార్యాలయాలకు అందించేవాడు. మారుతున్న పరిస్థితుల్లో కూడా నమ్ముకొన్న సిద్ధాంతాలను తుదిశ్వాస వరకు విడవలేదు. చైర్మన్ చెలమయ్య ఆయన మొదటి సినిమా. నవతరం ప్రొడక్షన్స్ పతాకంపై ఈయన 1980 లో తీసిన యువతరం కదిలింది సినిమాకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ బంగారు నంది పురస్కారం లభించింది. నవతరం పిక్చర్స్ బ్యానర్లో సినిమాలు నిర్మించిన మాదాల, ఎక్కువగా విప్లవ భావాలు కలిగిన చిత్రాలనే తీశాడు. నేటి తరంలో విప్లవ సినిమాలకు చిరునామాగా నిలిచిన ఆర్ నారాయణమూర్తికి మాదాల స్ఫూర్తిగా నిలిచారు.గత కొంతకాలంగా శ్వాసకోస సంబంధ వ్యాధితో బాధపడుతున్న మాదాల రంగారావు 2018, మే 27 ఆదివారం తెల్లవారుజామున 5 గంటలకు హైదరాబాదులో మరణించాడు.




# నేను స్టూడెంట్ సార్!' కు యూ/ఏ సర్టిఫికెట్



'స్వాతిముత్యం' సినిమా తో సక్సెస్ ఫుల్ గా అరంగేట్రం చేసిన యంగ్ హీరో బెల్లంకొండ గణేష్ 'నేను స్టూడెంట్ సార్' తో థ్రిల్ ఇవ్వడానికి రెడీ అవుతున్నాడు. ఈ చిత్రానికి రాఖీ ఉప్పలటి దర్శకత్వం వహించగా, ఎస్వీ 2 ఎంటర్‌టైన్‌మెంట్ పై 'నాంది' సతీష్ వర్మ నిర్మించారు. యాక్షన్ థ్రిల్లర్ గా రూపొందిన ఈ సినిమా టీజర్, ట్రైలర్ అంచనాలు పెంచాయి.జూన్ 2న నేను స్టూడెంట్ సార్ ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ప్రస్తుతం ప్రమోషన్స్ జోరుగా జరుగుతున్నాయి. తాజాగా ఈ చిత్రం సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకుంది. సెన్సార్ బోర్డ్ ఈ చిత్రానికి 'యూ/ఎ' సర్టిఫికేట్ ఇచ్చింది. ఒక మంచి సినిమా చూసిన అనుభూతి కలిగిందని సెన్సార్ బోర్డ్ సభ్యులు నేను స్టూడెంట్ సార్ టీం ని అభినందించారు. సినిమా మొదటి నుంచి చివరి వరకూ చాలా థ్రిల్లింగ్, గ్రిప్పింగ్ గా వుందని కితాబిచ్చారు.

ఈ చిత్రంలో గణేష్ కు జోడిగా అవంతిక దస్సాని నటిస్తున్నారు. సముద్రఖని, సునీల్, శ్రీకాంత్ అయ్యంగార్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. కృష్ణ చైతన్య కథ అందించిన ఈ చిత్రానికి మహతి స్వర సాగర్ సంగీతం అందించారు. అనిత్ మాదాడి కెమెరామెన్ గా పని చేస్తుండగా, చోటా కె ప్రసాద్ ఎడిటర్, కళ్యాణ్ చక్రవర్తి డైలాగ్స్ అందిస్తున్నారు.

నటీనటులు: బెల్లంకొండ గణేష్, అవంతిక దస్సాని, సముద్రఖని, సునీల్, శ్రీకాంత్ అయ్యంగార్, ఆటో రాంప్రసాద్, చరణ్‌దీప్, ప్రమోధిని, రవి శివతేజ

# 'టక్కర్' చిత్రం నుంచి 'ఊపిరే' పాట విడుదల



'నువ్వొస్తానంటే నేనొద్దంటానా', 'బొమ్మరిల్లు' వంటి సినిమాలతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని స్థానాన్ని సంపాదించుకున్న చార్మింగ్ హీరో సిద్దార్థ్ త్వరలో 'టక్కర్' అనే సినిమాతో సరికొత్తగా అలరించనున్నారు. ఈ చిత్రానికి కార్తీక్ జి. క్రిష్ దర్శకత్వం వహిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, పాషన్ స్టూడియోస్ తో కలిసి టీజీ విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వివేక్ కూచిభొట్ల సహ నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ సినిమాలో దివ్యాంశ కౌశిక్ కథానాయికగా నటిస్తున్నారు. 2023, జూన్ 9న తెలుగు, తమిళ భాషల్లో భారీస్థాయిలో ఈ చిత్రం విడుదల కానుంది.

ఇప్పటికే విడుదలైన 'టక్కర్' మూవీ టీజర్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. టీజర్ లో సిద్ధార్థ్ సరికొత్త మేకోవర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ చిత్రంతో సిద్ధార్థ్ మరో భారీ విజయాన్ని అందుకోవడం ఖాయమనే అంచనాలున్నాయి. అలాగే ఈ సినిమా నుంచి విడుదలైన 'కయ్యాలే', 'పెదవులు వీడి మౌనం' పాటలు కూడా విశేష ఆదరణ పొందాయి. తాజాగా ఈ చిత్రం నుంచి 'ఊపిరే' అంటూ సాగే మూడో పాట విడుదలైంది.

ఈ చిత్రానికి నివాస్ కె ప్రసన్న సంగీతం అందించగా, కృష్ణకాంత్ అన్ని పాటలకు సాహిత్యం అందించారు. 'కయ్యాలే', 'పెదవులు వీడి మౌనం' పాటల మాదిరిగానే 'ఊపిరే' పాట కూడా కట్టిపడేసేలా ఉంది. అభయ్ జోధ్‌పుర్కర్, సంజన కలమంజే ఈ పాటను ఎంతో అందంగా ఆలపించారు. "సొగసే మా వీధి వైపు.. సరదాగా సాగెనే.. దిశలేమో నన్ను చూసి.. కను గీటెనే" అంటూ కథానాయికపై కథానాయుడికి ఉన్న ప్రేమను తెలిపేలా ఎంతో అందంగా ఉంది ఈ పాట. తేలిక పదాలతో లోతైన భావం పలికించారు కృష్ణకాంత్.

నాయకా నాయికల మధ్య మొహాన్ని తెలిపేలా అద్భుతమైన సాహిత్యంతో పాట సాగింది. సంగీతానికి, సాహిత్యానికి తగ్గట్టుగానే నాయకా నాయికల మధ్య కెమిస్ట్రీ కూడా చక్కగా కుదిరింది. పాట వినగానే నచ్చేలా ఉంది. గత రెండు పాటల్లాగే ఈ పాట కూడా విశేష ఆదరణ పొందుతుందని స్పష్టమవుతోంది. మొత్తానికి టక్కర్ నుంచి విడుదలవుతున్న ఒక్కో పాట విశేషంగా ఆకట్టుకుంటూ, సినిమాపై అంచనాలను రోజురోజుకి పెంచేస్తోంది.

ఈ రొమాంటిక్ యాక్షన్ రైడ్ ప్రేక్షకులను ఆకట్టుకొని ఘన విజయం సాధిస్తుందని మేకర్స్ ఎంతో నమ్మకంగా ఉన్నారు. ఈ సినిమాలో అభిమన్యు సింగ్, యోగి బాబు, మునీశ్ కాంత్, ఆర్జే విఘ్నేశ్ కాంత్ తదితరులు ఇతర ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. నివాస్ కె. ప్రసన్న సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్ గా వాంచినాథన్ మురుగేశన్, ఎడిటర్ గా జీఏ గౌతమ్, ఆర్ట్ డైరెక్టర్ గా ఉదయ కుమార్ కె వ్యవహరిస్తున్నారు.

తారాగణం: సిద్ధార్థ్, దివ్యాంశ కౌశిక్, అభిమన్యు సింగ్, యోగి బాబు, మునీశ్ కాంత్, ఆర్జే విఘ్నేశ్ కాంత్

Printed, Published & Owned by K.Umadevi And Printed at Varadhi Publications,D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh.Published at D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh. EDITOR :K.Umadevi ,
e mail ID : b.nagaseshu47@gmail.com cell No:9985509053 RNI/APTEL/2021/80950